www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable


# పాయింట్

**Published From :** Hyderabad - Vijaywada - Delhi - Bengaluru | గురువారం 10, జూలై, 2025 | పేజీలు :12



## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై నెటిజన్స్ ఫైర్..!

4



## స్థానిక ఎన్నికల్లో కొత్త రిజర్వేషన్లు : పీసీసీ చీఫ్

4



## కల్తీ కల్లు కాటు.. ముగ్గురు మృతి.. 28మందికి అస్వస్థత..

4




### అవసరమైతే ఫామ్‌హౌస్‌కు వస్తా..

# చర్చకు సిద్ధమా..?

- **కేసీఆర్‌కు సీఎం రేవంత్ సూచన**
- **ప్రాజెక్టులపై ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్**
- **ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చిద్దాం రండి : రేవంత్**

**టీపీఎన్, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఆరోపించారు. కేంద్రం ముందు నివేదికల ద్వారా వాస్తవ పరిస్థితులను ఉంచామని, వాస్తవాలతో కూడిన నివేదికను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వివరించారని ఆయన గుర్తు చేశారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చించాలని కేసీఆర్‌కు సూచించినట్లు, ప్రతిపక్ష నేతగా ఆయన అసెంబ్లీకి రావాలని కోరినట్లు, అది సవాల్ కాదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రజాభవన్‌లో నీటిపారుదల ప్రాజెక్టుల అంశంపై ప్రజాప్రతినిధులకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరై రేవంత్ రెడ్డి మాట్లాడారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కృష్ణా జలాలపై చర్చకు ఇబ్బంది లేకుండా కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే చర్చ ఏర్పాటు చేయడానికి సిద్ధమని, తాను కూడా అక్కడికి వచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు. కేసీఆర్ తన కంటే సీనియర్ అని, ఆయన వద్దకు వెళ్లడానికి తనకు ఎలాంటి భేషజాలు లేవని, కేసీఆర్ కోరితే తప్పకుండా వెళ్తానని, ఫామ్‌హౌస్ భేటీకి తేదీ నిర్ణయించాలని కోరారు. తాను కేటీఆర్ అడిగినట్లు క్లబ్బులు, పబ్బులకు రానని, మొదటి నుంచి వాటికి దూరమని రేవంత్ తెలిపారు.గతంలో కేసీఆర్ బేసిన్లు, భేషజాలు లేవని చెప్పారని, గోదావరిలో 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని, గోదావరి, కృష్ణా, పెన్నా బేసిన్‌ల వరకు నీళ్లు తరలించవచ్చని, రాయలసీమను రత్నాల సీమగా చేస్తామని చెప్పారని రేవంత్ గుర్తు చేశారు. కేసీఆర్ ఏపీ మాజీ సీఎం జగన్‌కు సూచనలు, టెండర్లు, జీవోలు ఇచ్చేలా సహకరించారని, ఇద్దరి అనుబంధం తెలంగాణకు తీరని నష్టమని విమర్శించారు. వారి మధ్య అనుబంధం పెంచుకుంటే తమకు అభ్యంతరం లేదని, కానీ తెలంగాణ ప్రజలకు మరణ శాసనం రాసే అధికారం కేసీఆర్ లేదని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వాదించి ఉంటే హైదరాబాద్‌కు తాగునీరు సాధించే వాళ్లమని, ఉమ్మడి కోటా నుంచి హైదరాబాద్ తాగునీటిని వేరు చేసి, మిగిలిన జలాలను పరివాహక ప్రాంతాలకు పంపకాలు చేసి ఉంటే బాగుండేదని ఆయన అన్నారు. తుంగభద్ర, కృష్ణా, బీమా జలాలు మొదట గద్వాలకు వస్తాయని, తెలంగాణలోకి వచ్చిన వెంటనే నీటిని ఒడిసి పట్టుకోవాల్సి ఉందని, తెలంగాణ వదిలితేనే ఏపీ ప్రాజెక్టులకు నీళ్లు దొరుకుతాయని, ఏపీ నుంచి తిరిగి వచ్చాక చివరకు తీసుకునేలా చేశారని ఆరోపించారు. రాయలసీమకు వెళ్లిన జలాలను ఒడిసి పట్టుకునేలా ఏపీ చేస్తుంటే, తెలంగాణలోకి కృష్ణా జలాలు ప్రవేశించిన వెంటనే పాలమూరురంగారెడ్డి, నల్గొండ, ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉందని ఆయన తెలిపారు. జూరాల నుంచి నీళ్లు తెచ్చుకుంటే ఏపీ నీళ్లు కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదని, కేసీఆర్ నిర్ణయాలు కృష్ణా పరివాహక రైతులకు మరణశాసనంగా మారాయని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టుల్లో తెలంగాణకు వాటా వస్తే తక్కువ ధరకు విద్యుత్ వచ్చేదని, శ్రీశైలం, సాగర్, పులిచింతలలో విద్యుదుత్పత్తిలో వాటా వస్తే తక్కువ ధరకు వచ్చేదని, బారానా, ఆఠానాకు దొరకాల్సిన విద్యుత్‌ను యూనిట్ రూ.10కి కొనే పరిస్థితి వచ్చిందని ఆయన అన్నారు. గతంలో పాలమూరురంగారెడ్డి సామర్థ్యాన్ని 1 టీఎంసీకి తగ్గించారని, ఏపీ 10 టీఎంసీలతో ప్రాజెక్టులు చేపడితే పాలమూరును 1 టీఎంసీకి తగ్గించారని, ఏడాదికి కిలోమీటర్ టన్నెల్ పూర్తి చేసి ఉంటే ఎస్ఎల్‌బీసీ పూర్తయ్యేదని, రూ.వెయ్యి కోట్ల ప్రాజెక్టు అంచనా రూ.3 వేల కోట్లకు పెరిగిందని, 3.64 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ఎస్ఎల్‌బీసీని పక్కన పెట్టారని, పాలమూరురంగారెడ్డి అంచనాలు పెంచినా పూర్తి చేయలేదని ఆయన విమర్శించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ద్రోహం కంటే వెయ్యి రెట్లు ఎక్కువగా కెసిఆర్ తెలంగాణకు ద్రోహం చేశారని, తెలంగాణ హక్కులు, జలాలను ఏపీకి తాకట్టు పెట్టారని, చేసిన తప్పులకు ప్రజలు శిక్షిస్తే మౌనంగా ఉండకుండా బజారుకు ఎక్కారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో 54 లక్షల ఎకరాలకు ఎకరాకు రూ.93 వేలు ఖర్చుతో నీళ్లు ఇచ్చామని, కేసీఆర్ హయాంలో 15 లక్షల ఎకరాలకు ఎకరాకు రూ.11 లక్షలు ఖర్చు చేసి నీళ్లు ఇచ్చారని రేవంత్ రెడ్డి తెలిపారు.



### కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలపై

## ప్రభుత్వం కీలక నిర్ణయం..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలపై ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నియమించిన కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను సమీక్షించాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, పబ్లిక్ సెక్టర్ యూనిట్లు (పీఎస్‌యూలు), స్థానిక సంస్థలు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు మరియు ఇతర సంస్థల్లోని కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ పోస్టుల నియామకాలపై సమీక్ష కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసింది.ఈ కమిటీలో రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ ఏ. శాంతికుమారి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్. శివశంకర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, మరియు ఐఏఎస్ అధికారి రఘునందన్ రావు ఉన్నారు. ఈ కమిటీ మంజూరు చేయబడిన పోస్టులు, వాటి కొనసాగింపు, కొత్త ఆంక్షలు మరియు సవరణలపై అధ్యయనం చేయనుంది. శాఖా కార్యదర్శులు మరియు విభాగాధిపతులతో సంప్రదించి సమగ్ర అధ్యయనం నిర్వహించి, తెలంగాణ ప్రభుత్వానికి తుది నివేదికను సమర్పించనుంది.



## సిగాచీ పరిశ్రమ ప్రమాదంపై కీలక నిర్ణయం..!
## 8 మంది ఆచూకీపై ప్రభుత్వ ప్రకటన..!!

**టీపీఎన్, పాశమైలారం :**

సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంపై అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికుల ఆచూకీ లభించడం కష్టమని నిర్ధారించారు. రాహుల్, వెంకటేష్, శివాజీ, విజయ్, జస్టిన్, అఖిలేష్, రవి, ఇర్ఫాన్‌లు పూర్తిగా కాలి బూడిదైపోయినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ ఎనిమిది మంది మృతి చెందినట్లు అధికారికంగా ప్రకటించారు.బాధిత కుటుంబాలకు అంత్యక్రియల కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు సూచించారు. ఆచూకీ లభిస్తే సమాచారం అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం డీఎన్ఏ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 44 మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు.ఆచూకీ లభించని ఎనిమిది మంది కార్మికుల కుటుంబాలకు తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.15 లక్షల చెక్కులను అందజేశారు. ఏదైనా కొత్త సమాచారం లభిస్తే తెలియజేస్తామని, అప్పటి వరకు కుటుంబ సభ్యులు తమ స్వస్థలాలకు వెళ్లాలని అధికారులు కోరారు. అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని, సహాయక చర్యలు చివరి ఆచూకీ వరకు కొనసాగుతాయని హామీ ఇచ్చారు.గత నెల 30న తెలంగాణ చరిత్రలోనే ఒక ఘోర పారిశ్రామిక ప్రమాదం సంభవించింది. హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఔషధ పరిశ్రమలో ఉదయం భారీ విస్ఫోటనం జరిగింది. పేలుడు సమయంలో 700 నుంచి 800 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండటంతో ప్రమాదం తీవ్రంగా సంభవించింది. బ్లో ఎయిర్ హ్యాండ్లర్ శుభ్రపరచడంలో నిర్లక్ష్యం వల్ల దుమ్ము పేరుకుపోయింది, దీంతో డ్రయ్యర్‌లో ఉష్ణోగ్రతలు అదుపు తప్పడం వల్ల విస్ఫోటనం సంభవించినట్లు అధికారులు అంచనా వేశారు.



### రాజాసింగ్‌పై మాధవీలత సెటైర్లు..

## హైడ్రాపై విమర్శలు..!

టీపీఎన్, హైదరాబాద్ : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీని వీడి వెళ్లిపోయిన కారణం ఆయనకే తెలియదని బీజేపీ నేత మాధవి లత సెటైర్లు పేల్చారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా తనకు అధిష్ఠానం అవకాశం ఇవ్వడంపై రాజాసింగ్, "పార్టీలో మగాళ్లు లేరా..?" అని ప్రశ్నించారని ఆమె గుర్తు చేశారు. అయినప్పటికీ, రాజాసింగ్ తన తమ్ముడేనని మాధవి లత స్పష్టం చేశారు. తనకు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం తాను గోషామహల్‌తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నానని, తన పరిధి ఒక్క గోషామహల్‌కు పరిమితం కాదని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి ఎవరనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందని, తనకు అవకాశం ఇస్తే బరిలో నిలబడతానని వెల్లడించారు.అలాగే హైడ్రాపై ఆమె విరుచుకుపడ్డారు.పేద ప్రజల ఇళ్లను కూల్చుతున్న హైడ్రా, ఫాతిమా కాలేజీ విషయంలో ఎందుకు వెనక్కి తగ్గుతోందని సీఎం రేవంత్ రెడ్డిని మాధవి లత సూటిగా ప్రశ్నించారు. తన పార్లమెంట్ పరిధిలో వేలాది మంది ప్రజలు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఐఎం పార్టీ డబ్బుల మూటలతో ఈ ప్రభుత్వం నోరు మూసుకుంటోందని ఆమె మండిపడ్డారు. ఈ విషయంపై త్వరలో తమ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాధవి లత బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు.



## క్రికెట్ టిక్కెట్స్ వివాదం.. హెచ్‌సీఏ అధ్యక్షుడితో సహా అందరూ అరెస్ట్..!

- **విజిలెన్స్ నివేదిక ఆధారంగా రంగంలోకి దిగిన సీఐడీ..**
- **టిక్కెట్ల కోసం బెదిరించినట్లు ఆధారాలు లభ్యం..**
- **ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన విజిలెన్స్.. సీఐడీ..**

కృష్ణకుమార్, టీపీఎన్, హైదరాబాద్ : హెచ్‌సీఏ వివాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) అధ్యక్షుడు జగన్మోహన్ రావుతోపాటు పాలక వర్గంలోని పలువురు సభ్యులను సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఐపీఎల్ టికెట్ల వ్యవహారంలో విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా సీఐడీ ఈ చర్యలు చేపట్టింది. హెచ్‌సీఏ అధ్యక్షుడి హోదాలో జగన్మోహన్ రావు.. ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజ్‌ను బెదిరించినట్లు అభియోగాలు ఉన్నాయి. ఆ క్రమంలో 20 శాతం టికెట్లు ఫ్రీగా ఇవ్వాలని ఎస్ఆర్‌హెచ్‌ను జగన్మోహన్ రావు డిమాండ్ చేసినట్లు ఈ విచారణలో సీఐడీ అధికారులు గుర్తించారు. గతంలో ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా తమకు ఫ్రీగా టికెట్లు ఇవ్వాలంటూ ఎస్ఆర్‌హెచ్‌ను హెచ్‌సీఏ డిమాండ్ చేసింది. అలా చేయకుంటే.. మ్యాచ్ జరగబోనివ్వమంటూ ఎస్ఆర్‌హెచ్‌ను హెచ్‌సీఏ బెదిరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అందులోభాగంగా 10 శాతం టికెట్లు తమకు కేటాయించాలని ఎస్ఆర్‌హెచ్‌ను హెచ్‌సీఏ బెదిరించింది. ఈ నేపథ్యంలో బీసీసీఐను ఎస్ఆర్‌హెచ్ ఆశ్రయించింది. ఐపీఎల్ మ్యాచ్‌లకు వేదిక మార్చాలంటూ బీసీసీఐను ఎస్ఆర్‌హెచ్ కోరింది. దీంతో ఈ వివాదం సంచలనమైంది. దీనిపై విజిలెన్స్ విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఉప్పల్ స్టేడియంలో మొత్తం 37 వేల మంది వీక్షకులు కూర్చునేందుకు సిట్టింగ్ కెపాసిటీ ఉంది. అందులో 10 శాతం టికెట్లు.. కాంప్లిమెంటరీ రూపంలో హెచ్‌సీఏకు ఇస్తుంది. అయితే అవి తమకు సరిపోవని.. మరో 10 శాతం టికెట్లను కేటాయించాలంటూ ఎస్ఆర్‌హెచ్‌ను హెచ్‌సీఏ యాజమాన్యం డిమాండ్ చేసింది. దీంతో ఈ అంశంలో తమను బెదిరిస్తున్నారని.. తమపై ఒత్తిడి తీసుకు వస్తున్నారంటూ ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఆరోపించింది. ఆ క్రమంలో ఉప్పల్ స్టేడియం వేదికగా హైదరాబాద్, లక్నో మ్యాచ్ సందర్భంగా పలు వీఐపీ బ్యాక్స్‌లకు హెచ్‌సీఏ యాజమాన్యం తాళాలు వేసి.. తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందంటూ ఎస్ఆర్‌హెచ్ ఆరోపించింది. ఈ అంశంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తడంతో.. విజిలెన్స్ విచారణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా విజిలెన్స్ అధికారులు పలువురిని విచారించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులను సైతం విచారించారు. అందులో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ప్రమేయం ఉందనే విషయం బహిర్గతమైంది. ఈ నేపథ్యంలో ఆయనతోపాటు పలువురిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు.



## సీసీఐ, ఎస్ఐఐఎల్ పునరుద్ధరణకు కోసం విజ్ఞప్తి..!

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

తెలంగాణలో మూతపడిన రెండు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మరియు స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణకు చొరవ చూపాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్ డీ కుమారస్వామిని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. 'పారిశ్రామికాభివృద్ధి మరియు ఉపాధి కల్పన ద్వారా జాతీయ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి గణనీయంగా దోహదపడాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. ఈ లక్ష్య సాధనలో భాగంగా తెలంగాణలో మూతపడిన పరిశ్రమల పునరుద్ధరణపై దృష్టి సారించాము. పెద్దపల్లిలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) విజయవంతంగా నడుస్తోంది. అదే విధంగా, ఆదిలాబాద్ జిల్లాలోని సీసీఐ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ఎస్ఐఐఎల్‌ను పునరుద్ధరిస్తే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ మరియు పారిశ్రామికాభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుంది. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ దిశగా కేంద్రం చర్యలు తీసుకోవాలి' అని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. 'మా విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. ఈ రెండు పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు' అని మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# విత్తనోత్పత్తికి తెలంగాణ అత్యంత అనుకూలం..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

దేశంలో 60 శాతం విత్తనాలను ఉత్పత్తి చేసే రాష్ట్రంగా.. విత్తనోత్పత్తికి అత్యంత అనుకూలమైన ప్రాంతంగా తెలంగాణని గుర్తించబడిందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి చెప్పారు. మొక్కజొన్న, వరి, పత్తి వంటి విత్తనాలను మూల విత్తనాల రూపంలో రైతులకు అందించి, వారి ద్వారా పండించడం జరుగుతుందన్నారు. ఇక్కడ ఉత్పత్తి అయిన విత్తనాలు ప్రపంచవ్యాప్తంగా నలుమూలలకు సరఫరా అవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గత పదేళ్లలో రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత రైతు కమిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. దేశంలో పంజాబ్‌లో మాత్రమే రైతులు మరియు కూలీల కోసం కమిషన్ ఉంది, కానీ వ్యవసాయం దాని పరిధిలోకి రాలేదు. తెలంగాణలో మాత్రం వ్యవసాయం మరియు రైతు సంక్షేమం కోసం రైతు కమిషన్ ఏర్పాటు చేయబడింది. కమిషన్ ఏర్పాటైన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాము. ములుగులో మొక్కజొన్న విత్తనోత్పత్తిలో జరిగిన మోసాలు మీడియా ద్వారా బయటపడ్డాయి. మల్టీనేషనల్ కంపెనీలు రైతులతో ఒప్పందాలు చేసుకొని విత్తనోత్పత్తి చేస్తున్నాయి. విత్తనోత్పత్తిలో నష్టపోయిన 671 మంది రైతులకు నష్టపరిహారంగా 4 కోట్ల రూపాయలు అందించడం జరిగింది. ఇంతవరకు విత్తన కంపెనీల నుండి నష్టపరిహారం అందించిన దాఖలాలు లేవు, ఇది దేశంలోనే మొదటిసారి. గతంలో పత్తి బీటీ విత్తనాల విషయంలో కూడా ఇలాంటి సంఘటన జరిగింది. దీంతో వైఎస్ హయాంలో పత్తి విత్తన చట్టం తీసుకొచ్చారు. గత ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వం రైతుల కోసం 1.4 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. రైతు కమిషన్ రైతులకు భరోసాగా నిలుస్తోంది. మేము ఆదర్శ రైతు వ్యవస్థను ప్రతి గ్రామంలో స్థాపించాలని భావిస్తున్నాము. సీఎం కూడా ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించారు. గతంలో కూడా ఆదర్శ రైతు వ్యవస్థ ఉండేది, ఇప్పుడు మళ్లీ ఆదర్శ రైతులను ఎంపిక చేయనున్నాము. అగ్రికల్చర్ అధికారులు గ్రామాలకు వెళ్లి ఆదర్శ రైతులను ఎంపిక చేస్తారు. ఆదర్శ రైతులకు ప్రభుత్వం గౌరవం ఇస్తుంది, కానీ గౌరవ వేతనం ఉండదు, ఎందుకంటే ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ప్రభుత్వ పథకాలు ఆదర్శ రైతుల ద్వారా రైతులకు చేరేలా చూస్తాము. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. మల్టీనేషనల్ కంపెనీలు సులభంగా ఒప్పుకోకపోయినా, ఒత్తిడి ద్వారా వాటిని దారిలోకి తెచ్చాము. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కంపెనీలతో రాజీపడలేదు. విత్తన కంపెనీలను కట్టడి చేయడానికి త్వరలో విత్తన చట్టం తీసుకొస్తాము. వైఎస్ హయాంలో పత్తి విత్తన చట్టం తెచ్చినట్లే, ఇప్పుడు కూడా విత్తన చట్టం రూపొందించే పనిలో ఉన్నాము. ఈ క్ర□ంలో హర్యానాలో పర్యటించాము. మోదీ సర్కార్ విత్తన చట్టం తీసుకురావాలి, కానీ రాష్ట్రాలకు కొన్ని చట్టాల విషయంలో స్వేచ్ఛ ఇవ్వాలి. పంటల బీమా పథకం గుజరాత్‌లో కూడా అమలు కావడం లేదు. వ్యవసాయాన్ని రెండింతలు లాభసాటిగా చేస్తామని కేంద్రం చెప్పినా, అది కనిపించడం లేదు. రాష్ట్రాలకు అధికారాలు ఇవ్వాలి. ఎరువుల కోసం సీఎం ఢిల్లీకి వెళ్లారు. తెలంగాణలో ఏ పంటలు పండుతున్నాయి, ఎలాంటి ఎరువులు కావాలో కేంద్రానికి తెలియదా? రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఇబ్బంది పెట్టడం సరికాదు. యూరియా, ఎరువుల పరిశ్రమలు కేంద్రం నియంత్రణలో ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, దానికి తగిన ఆర్థిక సాయం చేయాలి. జన్యు మార్పిడి (GMO) ప్రపంచానికే ప్రమాదకరమని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా స్పందించారు. బియ్యంలో జన్యు మార్పిడికి కేంద్రం అనుకూలంగా వ్యవహరిస్తుంటే, మేము దానిని వ్యతిరేకించాము మరియు లేఖ రాశాము. కొన్ని కంపెనీలు ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవడానికి చేస్తున్న కుట్రను అందరూ ఖండించాలి. మన్మోహన్ సింగ్ హయాంలో వంకాయ జన్యు మార్పిడిని వ్యతిరేకించి, వెనక్కి తగ్గేలా చేశాం" అని చెప్పారు.



రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. "యూరియా విషయంలో కేంద్రం తెలంగాణను నిర్లక్ష్యం చేస్తోంది. రాష్ట్రానికి కావాల్సినంత యూరియాను కేటాయించడం లేదు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలి" అని సూచించారు.

మరో రైతు కమిషన్ సభ్యులు భవానీ రెడ్డి మాట్లాడుతూ.. "ములుగు జిల్లాలో నష్టపరిహారం అందించడంలో రైతు కమిషన్ కృషి చేసింది. ఇది దేశ చరిత్రలోనే మొదటిసారి. గిరిజన రైతుల్లో సంతోషం వ్యక్తమైంది. రైతు కమిషన్ నిత్యం రైతులకు అందుబాటులో ఉంటుంది" అని చెప్పారు.

## సీఎం రేవంత్‌రెడ్డి వినతికి స్పందించిన కేంద్రం..!

**టీపీఎన్, ఢిల్లీ :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో యూరియాకు గరిష్ట డిమాండ్ ఉంటుందని కేంద్రమంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. ఈ సీజన్‌లో తెలంగాణకు సరిపడా యూరియా సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సీఎం విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్నామని, తెలంగాణ రైతుల యూరియా డిమాండ్‌ను నెరవేర్చేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్రమంత్రి జేపీ నడ్డా తెలిపారు.



రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా జరిగేలా చూడాలని ఎరువుల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో మాటగా మాట్లాడిన జేపీ నడ్డా, రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి సారం తగ్గిపోతోందని సీఎంకు సూచించారు. 202324 రబీ సీజన్‌తో పోలిస్తే 202425లో యూరియా అమ్మకాలు 21 శాతం అధికంగా జరిగాయని, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు 12.4 శాతం అదనపు వినియోగం నమోదైందని వెల్లడించారు. వ్యవసాయేతర అవసరంగా యూరియాను మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జేపీ నడ్డా సూచించారు. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఎరువులు మరియు సేంద్రీయ సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించే పీఎం ప్రణామ్ పథకం గురించి తెలంగాణ అధికారులకు కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రంజిత్ కుమార్ మిశ్రా వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల మధ్య ఎరువుల సమన్వయం చేస్తూ, రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని జేపీ నడ్డా అధికారులను ఆదేశించారు.

## తెలంగాణ ఈఏపీసెట్‌లో నాన్ లోకల్ రగడ..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

తెలంగాణలో ఇంజనీరింగ్ నియామకాల్లో లోకల్... నాన్ లోకల్ వ్యవహారం విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన రేపుతోంది. ఇంజినీరింగ్ ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో పదో తరగతి వరకు ఏపీలో చదివి.. తెలంగాణాలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులను స్థానికేతర కోటాలో చూపడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఓకేషనల్ కోర్సులు, డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నతవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు 2024 వరకు ఉన్న లోకల్, నాన్ లోకల్, రిజర్వేషన్ విధానంలో తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే మార్పు చేసింది. రాష్ట్రంలోని సీట్లన్నీ తెలంగాణ వారికే లభించేలా మే నెలలో కొత్త జీవోను జారీ చేసింది. 202526 విద్యా సంవత్సరంలో స్థానికేతర కోటా 15 శాతం సీట్లనూ రాష్ట్ర విద్యార్థులకే కేటాయించేలా దీన్ని తీసుకొచ్చారు. దీనిపై అవగాహన లేని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇంజినీరింగ్ ప్రవేశానికి ముందు నాలుగేళ్లల్లో ఏ ఒక్క ఏడాది బయట రాష్ట్రంలో చదివినా.. వాళ్లను స్థానికేతరులుగానే పరిగణిస్తారు. గతంలో ఉస్మానియా, శ్రీవేంకటేశ్వర, ఆంధ్ర విశ్వవిద్యాలయాల రీజియన్లు ఉండగా.. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున ఉస్మానియా రీజియన్ను తొలగించి, కొత్త రిజర్వేషన్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉద్యోగ, ఉపాధి కారణాల రీత్యా తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నా.. ఇద్దరిలో ఎవరైనా ఒకరు గతంలో పదేళ్లపాటు ఏపీలో నివసించి ఉంటే వీరు స్థానికేతర కోటా 15 శాతం కింద పోటీ పడొచ్చు. కొంతమంది తల్లిదండ్రులు ఏపీలో ఉంటున్నా.. పిల్లలను తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివించారు. ఇప్పుడు వీళ్లు స్థానికేతర కోటాను పొందాలంటే 10 ఏళ్లు ఏపీలో ఉంటున్నట్లు సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లలకు స్థానికేతర కోటా లభించకపోవడంపై కొందరు తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.




# కల్తీ కల్లు కాటు.. ముగ్గురు మృతి.. 28మందికి అస్వస్థత..

- **పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు**
- **బాధితులను పరామర్శించిన మంత్రులు.. ప్రజాప్రతినిధులు..**
- **కల్లు కాంపౌండ్ యజమానిపై కేసు నమోదు..**

**కృష్ణకుమార్, టీపీఎన్, హైదరాబాద్ :** ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం.. పోలీసుల నిఘా వైఫల్యం.. కల్తీ మాఫియాకు అనువుగా మారింది. డ్రగ్స్, గంజాయి కట్టడి చేసేందుకు అధికారులు చూపించిన చొరవ.. కల్తీపై కన్నెత్తి చూడలేదన్న విమర్శలు ఉన్నాయి. అందుకే రెచ్చిపోయిన మాఫియా చేతుల్లో చిక్కి అమాయకులు ఆస్పత్రులపాలవుతున్నారు. తాజాగా కల్తీ కల్లు కాటుకు ముగ్గురు మృతి చెందినట్లు తెలుస్తోంది. ముమ్మాటికీ ఇది అధికారుల నిర్లక్ష్యమే అని బాధిత బంధువులు ఆరోపిస్తున్నారు. పరామర్శలు, నష్టపరిహారాలు కాదు పోయిన ప్రాణం తీసుకువస్తారా..? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రులు, గాంధీ మార్చురీ ఎక్కడ చూసినా బాధిత కుటుంబాల రోధనలే వినపడుతున్నాయి. నిత్యం దాడులు అని చెప్పే ఎక్సైజ్ అధికారులు కల్తీ కల్లుపై ఎందుకు శ్రద్ధ చూపలేదు అని ప్రశ్నిస్తున్నారు. అయితే అధికారుల వద్ద ఈ ప్రశ్నలకు జవాబు లేదని తెలుస్తోంది. బాధ్యులైన అధికారులపై కూడా కేసులు నమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్ఎమ్‌టీ హిల్స్ , శంశీగుడా, భాగ్యనగర్ కాలనీ, సర్దార్ పటేల్ నగర్, హైదర్ నగర్ ప్రాంతాల్లో ఉన్న కల్లు కాంపౌండ్లలో మంగళవారం సాయంత్రం చాలా మంది కల్లు సేవించారు. వీరంతా ఇంటికి వెళ్లిన వెంటనే అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షణాల్లో ఆయా ఆస్పత్రులకు పదుల సంఖ్యలో బాధితులు క్యూ కట్టారు. వారందరిని పరీక్షించిన వైద్యులు కల్తీ కల్లు తాగడం వల్ల అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. విషయం తెలిసిన వెంటనే పరుగులు పెట్టిన అధికారులు బాధితులను నిమ్స్, గాంధీ ఆస్పత్రికి తరలించారు. కల్తీ విషయం తెలియగానే వాటి యజమానులు వెంటనే తట్టా బుట్ట సర్దేశారు. చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురు చనిపోయారని తెలియడంతో మృతదేహాలను పోలీసులు గాంధీ మార్చురీ తరలించారు.

మంత్రులు, ప్రజా ప్రతినిధుల పరామర్శ..

కల్తీ కల్లు కాటు విషయం తెలియగానే మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావుతో పాటు పలువురు బాధితులను పరామర్శించారు. నిమ్స్ లో చికిత్స పొందుతున్న వారికి ప్రత్యేక వైద్య సదుపాయాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. బాధిత కుంబాలకు ధైర్యం చెప్పారు. కల్లు కాంపౌండ్ యజమానులను విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు.

**కేసు నమోదు...**

కూకట్‌పల్లి, బాలానగర్ ఏసీపీ పరిధిలో ఉన్న కల్లు కాంపౌండ్ యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నారు. కాంపౌండ్ వద్దకు వెళ్లి కల్లు శాంపిల్స్ సేకరించారు.



నిఘా వైఫల్యమే ఇందుకు కారణమా..

కల్తీ కల్లు ఘటనపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికుల పోలీసులు సరే, ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం కూడా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు కల్లు కాంపౌండ్‌లపై నిఘా పెట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఊగుతున్నారని, అందుకే నగరంలో కల్తీ సామ్రాజ్యం పెరిగిపోయిందని, స్థానిక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే హడావిడి తప్ప చర్యలు అంతగా ఉండవని మండిపడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. డ్రగ్స్, గంజాయి సరే మరి కల్తీ కల్లుపై నిఘా ఎందుకు లేదని ప్రశ్నించారు. బాధితులంతా కూలీ నాలి చేసుకొని బ్రతికేవారని, అడిగేవారు లేక ఇలా వాటి యాజమాన్యం రెచ్చిపోయారని మండిపడ్డారు. కల్తీ కల్లు వల్ల చాలా కుటుంబాలు తమ వారిని కోల్పోయి రోడ్డున పడ్డాయని విమర్శించారు. దీనిపై ప్రభుత్వం వెంటనే ఓ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కేసీఆర్ ఇలాకా నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు..!



**టీపీఎన్, గజ్వేల్ :** మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 200 మంది ప్రముఖ నాయకులు, గ్రామస్థాయి నుంచి వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు భారతీయ జనతా పార్టీలో చేరారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు.

బీజేపీలో చేరినవారిలో గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, తాజా మాజీ కౌన్సిలర్లు సుభాష్ చంద్రబోస్, రామచంద్రాచారి, జి. నర్సింహులు, దాస్, యూత్ ప్రెసిడెంట్ అనూప్, పద్మశాలి సంఘం అధ్యక్షులు ఆరెపు బాలచంద్రన్, కాంగ్రెస్ ఐటీ సెల్ అధ్యక్షులు బలరాం, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు మురళీ, మున్నూరుకాపు సమాజం అధ్యక్షులు ఐల కృష్ణ ఉన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. " మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం మరియు సిద్దిపేట జిల్లా నుంచి బీజేపీలో చేరిన నాయకులను సాదరంగా స్వాగతిస్తున్నాం. ప్రస్తుతం మెదక్ ఎంపీగా రఘునందన్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించారు. గజ్వేల్ నుంచి గెలిచిన కేసీఆర్ గతంలో ముఖ్యమంత్రిగా పనిచేశారు. హేమాహేమీ నాయకులు ప్రాతినిధ్యం వహించిన ఈ నియోజకవర్గం నుంచి బీజేపీలో పెద్ద ఎత్తున చేరికలు జరగడం ఆనందకరం. బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీలపై ప్రజల విశ్వాసం సన్నగిల్లింది. తాను రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది మొదటి చేరికల కార్యక్రమం. గజ్వేల్ నుంచి చేరికలు జరగడం బీజేపీకి శుభసూచకం. బీఆర్ఎస్ కంచుకోటగా పిలిచే గజ్వేల్ నుంచి భారీ సంఖ్యలో చేరికలు జరగడం సంతోషకరం. రానున్న రోజుల్లో యువత, మహిళలు మరియు ఇతర పార్టీ నాయకులు బీజేపీలో చేరాలని ఆహ్వానం. తెలంగాణలో బీజేపీని ప్రజలు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. బీజేపీపై ప్రజల విశ్వాసం పెరుగుతోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి వెళ్లి అబద్ధాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్లను విడుదల చేయడం లేదని దివ్యాంగులు బీజేపీ కార్యాలయంలో ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో కేవలం ఎన్నికల కోసం కొంతమందికి మాత్రమే డబ్బులు విడుదల చేసింది. భద్రాచలంలో ఈవోపై దాడి, దేవస్థానం భూముల ఆక్రమణ ప్రయత్నం బాధాకరం. ఇతర మతస్థులు దేవస్థానం భూములపై చర్చ్‌లు, మసీదులు నిర్మించేందుకు ప్రయత్నించారు. ఈవో ఆపే ప్రయత్నంలో దాడి జరిగింది. భద్రాచలంతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం భూములపై కూడా ఇలాంటి ఆక్రమణలు జరిగాయి. ఖమ్మంలో కొన్ని రాజకీయ పార్టీల ప్రోత్సాహంతో టీటీడీ భూములపై గోడలు కూల్చి, మసీదులు మరియు ఇతర కట్టడాలు నిర్మించారు. హిందూ దేవాలయ భూములను ఆక్రమణల నుంచి రక్షించాల్సిన అవసరం ఉంది. బీజేపీ ఆధ్వర్యంలో దేవాలయ భూముల పరిరక్షణ కోసం ఉద్యమం చేస్తాము. ఖమ్మంలో ఆక్రమించిన భూముల నుంచి ఆక్రమణదారులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఖాళీ చేయించాలి. ఈవోపై దాడి చేసినవారిపై, దేవాలయ భూములను ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు మరియు ఇతర హామీలను అమలు చేయడం లేదు. బీజేపీ మాత్రమే తెలంగాణకు మంచి భవిష్యత్తు అందించగలదని, రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ప్రజలు బీజేపీలో చేరాలని కోరుతున్నాను" అని చెప్పారు.

అనంతరం ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. "నేను కొట్టినట్లు చేస్తా, నీవు ఏడ్చినట్లు చెయ్" అనే తరహాలో బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీలు రాజకీయ నాటకాలు ఆడుతున్నాయని బీజేపీ ఆరోపించారు. "బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వివిధ అంశాలపై చర్చల పేరుతో సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకోవడం రాజకీయ నాటకంలో భాగమే. తెలంగాణ ప్రజలు ఈ నాటకాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వేదిక శాసనసభ లేదా పార్లమెంట్. బీఆర్ఎస్‌కు పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకపోవడం మెదక్ ప్రజల ఘన విజయం మరియు గర్వకారణం. దుబ్బాకలో బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌కు చరమగీతం పాడే కార్యక్రమం ప్రారంభించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను ఓడించారు. గజ్వేల్, సిద్దిపేట వంటి బీఆర్ఎస్ కంచుకోటలుగా చెప్పుకునే నియోజకవర్గాల నుంచి బీజేపీ గెలవడం ద్వారా ప్రజలు ఈ రెండు పార్టీల నాటకానికి స్వస్తి పలికారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీలు మీడియా దృష్టి కోసం బీజేపీని ఇబ్బంది పెట్టే కుట్రలు చేస్తున్నాయి. కానీ, బీజేపీ కార్యకర్తల ధైర్యం మరియు లక్ష్యం ముందు ఇతర పార్టీలు నిలబడలేవని మెదక్ గెలుపు నిరూపించింది. గత బీఆర్ఎస్ మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులు చెల్లించలేదు. ట్రాక్టర్లకు డీజిల్, గ్రామ పంచాయతీలకు కరెంట్ బిల్లులు చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. గత ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం అవకతవకలకు పాల్పడుతూ, నిధుల మళ్లింపు చేస్తూ, 'రైతు భరోసా' పేరుతో కొంతమందికి మాత్రమే నిధులు విడుదల చేసింది. ఇది స్థానిక ఎన్నికల కోసమే. ఉనికి మరియు గుర్తింపు కోసం బీఆర్ఎస్ రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా కేటీఆర్ ఇటీవల నాటకం ఆడారు. ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్తున్న విషయం తెలిసి, ప్రెస్ క్లబ్‌లో చర్చకు పిలిచి నాటకం ఆడారు. బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే, గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు, జీహెచ్ఎంసీలో నిలిచిపోయిన పనులు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల అంశాలపై చర్చ జరపాలి. రాష్ట్ర శాసనసభ సమావేశాలను ప్రారంభించి, ప్రజా సమస్యలపై చర్చించాలి. ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రెస్ క్లబ్ లేదా ఇతర వేదికల్లో చర్చల పేరుతో నాటకాలు ఆడొద్దని బీఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీలకు హితవు పలుకుతున్నాము. మెదక్ జిల్లా బీజేపీకి కంచుకోటగా మారుతోంది. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీజేపీ జయకేతనం ఎగురుతోంది. దీనికి నిదర్శనం బీజేపీలో జరుగుతున్న భారీ చేరికలు" అని చెప్పారు.



## ఉనికి కోసమే బీఆర్ఎస్ దాడులు..!

**టీపీఎన్, హైదరాబాద్ :** ఉనికి కోసమే బీఆర్ఎస్ దాడులకు పాల్పడుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత సతీష్ మాదిగ మండిపడ్డారు. ఇటీవల మహా న్యూస్ టీవీ, ABN ఆంధ్ర జ్యోతి మీద దాడులు చేయడానికి ప్రయత్నించిన బీఆర్ఎస్.. ఇప్పుడు ఏకంగా తనపైనే దాడికి పాల్పడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "చరిత్రలో ఇలాంటి సంఘటనలు ఒక పార్టీ, వ్యక్తి లేదా సంస్థ పతన దశలో ఉన్నప్పుడు, తమ ఉనికిని కాపాడుకోవడానికి ఇటువంటి దాడులు జరుగుతాయి. ప్రస్తుతం తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పతన దశలో ఉంది. ఆత్మరక్షణ కోసం ఈ దాడులకు పాల్పడుతోంది. కేసీఆర్ మాజీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డి ప్రస్తుత ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం, ఓటు అనేది అందరికీ సమానం. పూరి గుడిసె నుండి గెలిచిన ఎమ్మెల్యేకి, ఏడు అంతస్తుల భవనంలో ఉండి గెలిచిన ఎమ్మెల్యేకి అధికారం సమానమే. 60 ఏళ్ల వయస్సులో కేసీఆర్ ముఖ్యమంత్రిగా గౌరవం పొందినట్లే, ఇండిపెండెంట్‌గా జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, టీడీపీ నుండి ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచి, 55 ఏళ్ల వయస్సులో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన నవయువకుడు రేవంత్ రెడ్డి కూడా ఆ హోదాకు సరిపోతారు. రాజ్యాంగం ప్రకారం ముఖ్యమంత్రి హోదా అనుభవంతో గానీ, వయస్సుతో గానీ సంబంధం లేదు. ఈ రాజ్యాంగ జ్ఞానం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ శ్రేణులకు ఎందుకు అర్థం కావడం లేదు? నోరు తెరిస్తే ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డిని దూషిస్తూ, అసెంబ్లీ నిర్వహణలో ఆయన చేసిన సవాళ్లకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పకుండా ఫామ్‌హౌస్‌లో ఉంటున్నారు. కేసీఆర్ వారసులైన కేటీఆర్, హరీష్ రావు ఊర కుక్కల కంటే హీనంగా వ్యవహరిస్తూ, రేవంత్ రెడ్డిని దుర్భాషలాడుతున్నారు. వారు మాట్లాడే ఈ భాషను కింది స్థాయి కార్యకర్తలకు నేర్పిస్తున్నారు. ఫలితంగా, వారు కూడా రాజ్యాంగ విలువలతో కూడిన ముఖ్యమంత్రిని తిడుతున్నారు. ఇది సరైన సంస్కృతి కాదని, కేటీఆర్, హరీష్ రావులను హెచ్చ



## ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నేతలతో మంత్రి పొన్నం సమావేశం..!

**టీపీఎన్, హైదరాబాద్ :** బేగంపేట టూరిజం ప్లాజాలో పీసీసీ ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నేతలు, పార్లమెంట్ ఇంచార్జిలు, జనరల్ సెక్రెటరీలు, అభ్యర్థులు పార్టీ పోటీ చేసిన అభ్యర్థులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు ఏఐసీసీ ఆదేశాల మేరకు ఈనెల 15 వ తేదీ లోపు జిల్లా పార్టీ సంస్థాగత నిర్మాణం పూర్తి చేసేలా కసరత్తు చేశారు. 13 వ తేది లోపు ఉమ్మడి జిల్లాలో పోటీ చేసిన అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షుల సమక్షంలో పార్టీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు ఆశావహుల జాబితా ప్రక్రియ కొలిక్కి తేవాలని ఆదేశించారు. మండల, జిల్లా కార్యవర్గంలో యువత కి పెద్ద పీట వేయాలని ,మహిళలకు అవకాశం కల్పించాలని కార్యవర్గంలో సామాజిక న్యాయం జరిగేలా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లకు అవకాశం ఇవ్వాలని ఆదేశించారు. ఈ నెల 14 వ తేదీ ఉమ్మడి జిల్లాల వారిగా గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో ఉదయం 10 గంటలకు సిద్దిపేట జిల్లా, మధ్యాహ్నం 2 గంటలకు సంగారెడ్డి జిల్లా ఆశావహులతో నేరుగా పార్టీ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటర్వ్యూ చేయనున్నారు. పార్టీకి ఎవరైతే లాయలిస్ట్‌గా ఉండి కష్టపడతారో వారికే అవకాశం ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం పార్టీ బలోపేతం దిశగా ఉండేలా ముఖ్య నేతలు, డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జిలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ముగ్గురు డీసీసీ అధ్యక్షులు, పార్లమెంట్ ఇంచార్జిలు, అభ్యర్థులు, నియోజకవర్గ ఇంచార్జిలు, జిల్లా ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు భారీ దెబ్బ.. కాంగ్రెస్‌లో భారీగా చేరికలు..!



**టీపీఎన్, కరీంనగర్ :** తిమ్మాపూర్ మండలంలోని పార్లపల్లి, మన్నెంపల్లి గ్రామాల నుంచి మాజీ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరారు. ఈ చేరిక కార్యక్రమం ఎల్ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించబడింది. మానకొండూర్ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డా. కవ్వంపల్లి సత్యనారాయణ వారికి పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో చేరినవారిలో మాజీ తిమ్మాపూర్ మండల పరిషత్ అధ్యక్షుడు కరివేద సింగా రెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు కరివేద సుధాకర్ రెడ్డి, మన్నెంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేడి అంజయ్యతో పాటు, వివిధ కుల సంఘాలు, గ్రామ స్థాయి కమిటీలకు చెందిన ప్రముఖులు ఉన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ, "రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ పాలనను అభినందిస్తూ ప్రజలకు సేవ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీ తలుపులు తెరిచి ఉంచింది. గత పదేళ్ల పాటు కేసీఆర్ నియంతృత్వ పాలనలో ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఆ అధ్యాయం ముగిసింది. ఇప్పుడు ప్రజల ప్రభుత్వం నడుస్తోంది," అని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిని తగిన గుర్తింపు, బాధ్యతలు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. "కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తోంది. అందుకే అనేక మంది మా సిద్ధాంతాలు, విధానాల వైపుకి ఆకర్షితులవుతున్నారు," అని చెప్పారు.

ఈ సందర్భంగా రాజక సంఘం మాజీ అధ్యక్షుడు గుడేపు మండయ్య, మాల సంఘానికి చెందిన భుల్లు రమేశ్, పి. బసవయ్య, గుడేపు శంకర్, ఎలేటి రవి, కసర్ల రాజు, ఎం.డి. ఖలీల్, గుంటి రాజశేఖర్ తదితర బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# పాత కొత్వాల్ భవనానికి కొత్త రూపం..!

- 150సంవత్సరాల ఘన చరిత్ర..
- శిథిలావస్థకు చేరిన పాత కమిషనర్ కార్యాలయం..
- కమిషనర్ సి.వి. ఆనంద్ చొరవతో మహర్దశ..
- గ్రీన్కో సహారంతో మరోసారి అభివృద్ధి..



కృష్ణకుమార్, టీపీఎన్, హైదరాబాద్ : పురానీ హవేలి.. ఆ పేరులోనే పాతబస్తీ భవనం అని ఉంటుంది.. అక్కడ 150 ఏళ్ల కిందట నవాబుల కాలం నుండి పాతబస్తీ వేదికగా పరిపాలనా భవనాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సంస్థానం అక్కడి నుండే నడిచేది. ఆ తరువాత నగరానికి కొత్వాల్ ( పోలీస్ కమిషనర్ కార్యాలయం) కార్యాలయంగా పేరు గడించింది.. కాలక్రమేణా బషీర్ బాగ్ అక్కడి నుండి ప్రస్తుతం బంజారాహిల్స్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోకి కమిషనర్ కార్యాలయం మారిపోయింది. ప్రస్తుతం పురానీ హవేలి పాత కమిషనర్ ఆఫీస్ అంటూ పేరు పాతుకు పోయిన అక్కడ సౌత్ జోన్ డీసీపీ ఆఫీస్, టాస్క్ ఫోర్స్ ఆఫీస్‌తోపాటు స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాలు పని చేస్తున్నాయి. ఈ కార్యాలయాన్ని ఎలాగైనా అభివృద్ధి చేయాలని ఇప్పటి కమిషనర్ సీవీ ఆనంద్ మనసులో పడింది.

150 సంవత్సరాల నాటి భవనం నాలుగేళ్ల క్రితం పైకప్పు కూలిపోయి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. హైదరాబాద్ నగర వారసత్వాన్ని పరిరక్షించాలనే సంకల్పంతో పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పునరుద్ధరణకు పూనుకున్నారు. గ్రీన్‌కో సీఎండి అనిల్ ఆర్థిక సహకారంతో 2022 డిసెంబర్‌లో పనులు ప్రారంభమయ్యాయి. అయితే 2023 అక్టోబర్‌లో కమిషనర్ ఆనంద్ బదిలీ అయిన తర్వాత ఈ ప్రాజెక్టు తాత్కాలికంగా నిలిచిపోయింది. 2024 సెప్టెంబర్‌లో ఆనంద్ తిరిగి పోలీస్ కమిషనర్‌గా నియమితులైన తర్వాత పునరుద్ధరణ పనులకు మరింత వేగం పెంచారు. ఈ పనులను డెక్కన్ టెరైన్ ఏజెన్సీ అధినేత మీర్ ఖాన్ పర్యవేక్షణలో సవాలుతో కూడుకున్న పనులను నాణ్యతతో నిర్వహించారు. మొత్తానికి కార్యాలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.

హైదరాబాద్ పోలీసింగ్ చరిత్రలో ఈ భవనానికి విశేష ప్రాముఖ్యత ఉంది. పాతబస్తీ పర్యటనల సమయంలో కోత్వాల్‌కు మర్యాదైన కార్యాలయం సిద్ధమైనందున కమిషనర్ ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. తిరిగి కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రారంభించారు. పునరుద్ధరించబడిన ఈ చారిత్రక నిర్మాణం హైదరాబాద్ నగరం తమ సాంస్కృతిక, పరిపాలనా వారసత్వాన్ని గౌరవిస్తూ దాన్ని భద్రంగా కొనసాగిస్తుందనడానికి ప్రతీకగా నిలిచింది. కమిషనర్ ఆనంద్ చేపట్టిన ఈ అభివృద్ధి పనులపై నిజాం వారసులే కాకుండా, పాతబస్తీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## బైరామల్‌గూడ చెరువు పరిస్థితిపై సమీక్ష..!

**టీపీఎన్, ఎల్బీనగర్** : హైడ్రా కమిషనర్ రంగనాథ్ బైరామల్‌గూడ చెరువు ఆక్రమణ సమస్యను సమీక్షించారు. ఈ సమస్యను రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన రంగనాథ్ తన అధికార బృందంతో కలిసి చెరువు ప్రాంతాన్ని పరిశీలించి, ఆక్రమణకు గురైన స్థలాన్ని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. వీలైనంత త్వరగా ఆక్రమణలను తొలగిస్తామని, చెరువు పరిసరాల్లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించేందుకు తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అన్ని శాఖల సమన్వయంతో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, ఎల్బీనగర్‌లోని అన్ని చెరువులను మరోసారి పరిశీలించి, తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మరియు అతని అనుచరులు బైరామల్‌గూడ చెరువును ఆక్రమించారని మల్‌రెడ్డి రాంరెడ్డి ఆరోపించారు. ఈ ఆక్రమణ కారణంగా హస్తినాపురం డివిజన్ రెడ్డి కాలనీతో సహా 150 కాలనీల నుండి వచ్చే వరద నీరు ఇళ్లలోకి చేరుతోందని తెలిపారు. అలాగే, సుధీర్ రెడ్డి అండదండలతో చేపల చెరువు, బైరామల్‌గూడ చెరువు మరియు ఎల్బీనగర్‌లోని ఇతర చెరువులను ఆక్రమించి, ప్లాట్లుగా విభజించి అమ్మకాలు జరిపారని ఆరోపించారు.గతంలో రేవంత్ రెడ్డి మల్కాజ్‌గిరి ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు బైరామల్‌గూడ చెరువు ఆక్రమణపై తీవ్రంగా స్పందించారని మల్‌రెడ్డి రాంరెడ్డి గుర్తుచేశారు. ఎల్బీనగర్‌లోని చెరువుల పరిరక్షణ కోసం అధికార యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని, అవసరమైన అన్ని రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, హైడ్రా బృంద సభ్యులు పాల్గొన్నారు.



## అనుమతులు లేని వీధి దుకాణాల తొలగింపు..!

**టీపీఎన్, హైదరాబాద్:** తార్నాకలోని క్రాస్ రోడ్డుని ఆక్రమించి నడుపుతున్న వీధి దుకాణాలు స్థానిక పౌరులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి చెప్పారు. రోడ్డుపై ఈ దుకాణాలు పెట్టడంతో పాదచారులు నడవడానికి బాగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే, కొంతమంది వ్యాపారులు చెత్తను రోడ్డుపై వేస్తూ పరిసరాల శుభ్రతను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. అనంతరం తార్నాక ప్రధాన రహదారిపై అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ దుకాణాలను గుర్తించి వెంటనే తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ గారు మాట్లాడుతూ..."పౌరుల సౌకర్యం, నగర శుభ్రత కోసం ఇటువంటి ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగిస్తాం. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, రోడ్లపై అక్రమ దుకాణాలు పెట్టడం అనేది తీవ్రంగా నిషేధించబడింది. జీహెచ్ఎంసీ అధికారులు ఈ అంశంలో ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించాను" అని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల నుంచి డిప్యూటీ మేయర్ గారి ఈ స్పందనకు మంచి స్పందన లభించింది.



## సంస్కృతీ, సంప్రదాయాలను యువత కాపాడాలి : హనుమాన్ చౌదరి

**టీపీఎన్, హైదరాబాద్ :** యువతీ యువకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ టీ హనుమాన్ చౌదరి సూచించారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని పాటించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అవంతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో నూతన డిగ్రీ విద్యార్థులకు ప్రవిష్ఠ2025 పేరుతో ఆహ్వాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ హనుమాన్ చౌదరి, అవంతి గ్రూప్ విద్యాసంస్థల ఛైర్మన్ ఎం. శ్రీనివాసరావు, తదితరులు హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అవంతి విద్యాసంస్థల ఛైర్మన్ ఏం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలను పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగాలు రాలేదని నిరాశ నిస్పృహలకు గురికాకుండా తమన నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలని ఆయన సూచించారు. కష్టపడిన ప్రతి విద్యార్థికి ఫలితం ఉంటుందని ఆయన అన్నారు.

## ఫాతిమా కాలేజ్ గురించి రంగనాథ్ కామెంట్స్‌పై నెటిజన్స్ ఫైర్..!



**జీ అవినాశ్, టీపీఎన్, హైదరాబాద్ :** హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (HYDRAA) కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇటీవల చేసిన ఓ వ్యాఖ్య వివాదాస్పదంగా మారింది. AIMIM అధ్యక్షుడు మరియు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నడిపిస్తున్న ఫాతిమా కళాశాలపై ఆయన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. సురం చెరువు పూర్తి స్థాయి నీటి మట్టం (FTL) పరిధిలో ఉన్న ఈ కళాశాల అక్రమ నిర్మాణమని గుర్తించినా, GHMC చేపట్టిన సరస్సుల పరిరక్షణ డ్రైవ్‌లో తొలగించకపోవడంపై ప్రజలు ప్రశ్నలు పెడుతున్నారు. రంగనాథ్ మాట్లాడుతూ, "ఈ కళాశాలలో దాదాపు 10,000 మంది పేద ముస్లిం బాలికలు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య పొందుతున్నారు. మేము దీనిని మానవతా దృష్టితో చూశాం. సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని కూల్చకపోయాం," అని తెలిపారు.అయితే, ఇది బలహీనత కాదని స్పష్టంచేశారు. "మేము ఇప్పటికే AIMIMకు చెందిన అనేక నేతల అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. రూ.1,000 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నాం. చంద్రాయణగుట్టలో అక్రమ భూమిని కూడా స్వాధీనం చేసుకున్నాం," అని రంగనాథ్ అన్నారు.ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి. నెటిజన్లు "మానవతా దృక్పథం" పేరుతో ఒక వర్గానికి మినహాయింపులు ఇవ్వడం సరికాదని అంటున్నారు. "ఒకవైపు పేదల ఇళ్లను నోటీసులేకుండా కూల్చేస్తున్నారు, మరోవైపు ఓవైసీ కళాశాలనైతే మానవతా కోణంతో వదిలేస్తున్నారు. ఇది ద్వంద్వ వైఖరి కాదు?" అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

హైకోర్టు ఇటీవల అధికారులు నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లు కూల్చినందుకు తీవ్ర వ్యాఖ్యలు చేసిన సందర్భాన్ని కూడా కొందరు ప్రస్తావించారు. "నియమం ఒక్కటే ఉంటే, అది అందరికీ వర్తించాలి. మంచి ఉద్దేశం ఉన్నా, అది చట్ట విరుద్ధమైతే ఎలా సమర్థించగలం?" అని ఓ నెటిజన్ వ్యాఖ్యానించాడు.



## పద్మారావు నగర్ నాలాను పరిశీలించిన కమిషనర్ ఆరవీ కర్ణన్

**టీపీఎన్, హైదరాబాద్:** ముషీరాబాద్ సర్కిల్ నాగమయ్య కుంట నుండి పద్మారావు నగర్ వరకు చేపట్టిన నాలానా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. గతంలో ఎస్ఎన్‌డి ద్వారా చేపట్టిన నాలా అభివృద్ధి పనులను ఇతర కారణాల వల్ల చివరి భాగంలో పూర్తి కాలేదు. మిగిలిపోయిన అసంపూర్తిగా ఉన్న నాలా పనులు సత్వరమే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. అందుకు కావలసిన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వరద సందర్భంగా నాలాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓపెన్ నాలాపై స్లాబ్ పనులు, సరిహద్దు వాల్ నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్ష కాలంలో వరద ఏర్పడిన సందర్భంలో గానీ, రోడ్డు మరమ్మతులు చేసే సందర్భంలో గానీ, భద్రతా చర్యల్లో భాగంగా హెచ్చరిక బోర్డులు పెట్టకుండా ప్రమాదాలు జరిగిన సందర్భంలో.. సంబంధిత ఇంజనీర్‌పై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ రామ సుజా రెడ్డి, జోనల్, సర్కిల్ స్థాయి ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు ఉన్నారు.



# బీసీ రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించాలి..!

**టీపీఎన్, హైదరాబాద్ :** క్యాబినెట్ మీటింగ్‌లో కంటితుడుపు చర్యగా 42 శాతం రిజర్వేషన్లపై జీవో తీసుకురావాలని ప్రభుత్వం చూస్తుందని బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలరాజ్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే , అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎందుకు తీసుకెళ్లడం లేదని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ చిక్కడపల్లి లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని ఇచ్చిన హామీకి చట్టబద్దత కల్పించాలన్నారు. ఈ రిజర్వేషన్ల బిల్లు రాజ్యాంగంలోని 9వ షెడ్యుల్‌లో చేరిస్తేనే, రిజర్వేషన్లు అమలు అవుతాయని తెలిపారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. లేకపోతే కాంగ్రెస్ పార్టీలో ఉన్న బీపీ ప్రజా ప్రతినిధులు రాజీనామా చేసి బయటకు రావాలని పిలుపునిచ్చారు.

## నాకాబందీ, నిర్వహించిన 4 గంటల్లోనే ఏటీఎం చోరీ..!




**టీపీఎన్, మేడ్చల్ జిల్లా :** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కండేయ నగర్ హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలో చోరీ చేశారు. మంగళవారం రాత్రి బాలనగర్ ఏసీపీ ఆధ్వర్యంలో నాకాబందీ, కార్డెన్ సెర్చ్ నిర్వహించిన 4 గంటల్లోనే అదే ఏరియాలో ఏటీఎం చోరికి దుండగులు తెగబడ్డారు. గ్యాస్ కట్టర్స్ సహాయంతో ఏటీఎం మిషన్‌లో డబ్బులు ఇన్‌స్టాల్ చేసే బాక్స్‌నే దుండగలు దోచుకెళ్లారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు ఏటీఎం మిషన్లను గ్యాస్ కట్టర్ సహాయంతో నలుగురు వ్యక్తులు టూ వీలర్స్‌పై వచ్చి దాంట్లో ఉన్న డబ్బులను తీసుకెళ్లినట్లు తెలిసిందన్నారు. దాంట్లో ఎన్ని డబ్బులు ఉన్నాయి..? ఏంటి..? అనే విషయాన్ని బ్యాంకు వాళ్లు అకౌంట్ సరి చూసుకొని తెలియజేస్తామని చెప్పినట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం నలుగురు వ్యక్తులు ఈ దొంగతనంలో సిలిండర్ తీసుకొని వచ్చి కట్టర్ సహాయంతో ఏటీఎంను కట్ చేసినట్టు తెలిసిందన్నారు. ముంబై నుంచి తమని అలర్ట్ చేశారని.. ఐదు నిమిషాల్లో సిబ్బంది స్థానిక సీఐ సంఘటన స్థలానికి వచ్చి ఏటీఎంలను పరిశీలించారని తెలిపారు. కొన్ని క్లూస్ దొరికాయని.. కొంతవరకు ఐడెంటిఫై చేశామన్నారు. ఎలాగైనా నిందితులను పట్టుకుంటామని బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు..

## ఘనంగా వన మహోత్సవం..!



**టీపీఎన్, కొత్తగూడెం :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వారి ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ పొదెం వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై, కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, ఓబీసీ సెల్, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, పీసీసీ డెలిగేట్లు, అన్ని అనుబంధ సంఘాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల తనిఖీ..!

**టీపీఎన్, శామీర్‌పేట్ :** సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమే కాకుండా ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చూడడం అధికారుల బాధ్యత అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. బుధవారం శామీర్ పేట మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల వసతులు, ఆహార నాణ్యత, పరిశుభ్రత , విద్య బోధన వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. స్కూల్లో వసతులు ఎలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకొని, మెను చార్టును పరిశీలించారు. గురుకుల ప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూడాలని, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చూడడం అధికారుల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి విజయ కుమారి, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, గురుకుల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

# శాలిబండ, ఛత్రినాక పోలీస్ స్టేషన్ల నూతన భవనాలు ప్రారంభం..!



**టీపీఎన్, హైదరాబాద్ :** హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శాలిబండ పోలీస్ స్టేషన్ మరియు ఛత్రినాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ అధికారులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. అనంతరం, పురాని హవేలీలో నిజాం కాలం నాటి హైదరాబాద్ సీపీ కార్యాలయం అయిన కొత్వాల్ హౌజ్ (పునరుద్ధరించిన హెరిటేజ్ నిర్మాణం)ను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..“120 సంవత్సరాల చరిత్ర కలిగిన కొత్వాల్ హౌజ్ ఆఫీసును పునరుద్ధరించినందుకు అందరికీ శుభాకాంక్షలు. కమిషనర్ సివి ఆనంద్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ తమ CSR నిధుల ద్వారా ఆర్థిక సహాయం అందించి, ఈ హెరిటేజ్ నిర్మాణాన్ని భవిష్యత్ తరాలకు గుర్తుండేలా చేసినందుకు వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను,” అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.తెలంగాణ పోలీస్ దేశంలోనే చట్టం మరియు శాంతిభద్రతలను నిర్వహించడంలో ప్రథమ స్థానంలో ఉందని ఆయన పేర్కొన్నారు. “చట్టం మరియు శాంతిభద్రతలు సరిగ్గా నిర్వహించబడితేనే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయి, పర్యాటక రంగం బలోపేతం అవుతుంది. హైదరాబాద్ నగరంలో ప్రజలు సోదరభావంతో కలిసిమెలిసి జీవిస్తారు,” అని ఆయన అన్నారు. “చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయకపోతే, వారు మనలను మరచిపోతారు. చరిత్ర నుండి మనం చాలా నేర్చుకోవచ్చు, అది మన జీవన విధానాన్ని తెలియజేస్తుంది,” అని మంత్రి పేర్కొన్నారు. అసదుద్దీన్ ఒవైసీ సర్దార్ మహల్, పురాణ పుల్, విద్యా సంస్థల గురించి ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు. ఏఐ, సీసీ కెమెరాల వంటి సాంకేతికతలను బలోపేతం చేయడానికి 72 పోలీస్ స్టేషన్లకు ఒక్కొక్కటికి రూ.5 లక్షల చొప్పున, మొత్తం రూ.3 కోట్ల నిధులను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా అనుమతి తీసుకుని మంజూరు చేస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

## గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల తనిఖీ



**టీపీఎన్, అశ్వాపురం :** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు వారి ఆసక్తికి తగిన కళల పట్ల మక్కువ కలిగించి, వారిలో దాగివున్న ప్రతిభను, నైపుణ్యాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. బుధవారం అశ్వాపురం మండలంలోని గొంది గూడెం బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటశాల, స్టోర్ రూమ్‌లోని సామాగ్రి, విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను ఆయన పరిశీలించారు. మూడో తరగతి నుండి ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్ పదాలను బోర్డుపై వ్రాయించి, వాటి అర్థాలను తెలుగులో చెప్పమని అడిగారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు నిర్వహిస్తున్న తరగతుల బోధనా పద్ధతులను, ఉపాధ్యాయుల తీరును కూడా ఆయన గమనించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఇంగ్లీష్ పదాలను బోర్డుపై వ్రాయించి, వాటి అర్థాలను తెలుగులో వివరించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం పాఠ్యాంశాల బోధనతో పాటు, విద్యార్థులకు ఇష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయం వంటి కళలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.



## అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ..!

**టీపీఎన్, భద్రాచలం :** కార్మికుల పనిదినాన్ని ఎనిమిది గంటల నుంచి 10 గంటలకు మార్చడంతో దేశవ్యాప్తంగా వామపక్షాలు చేపట్టిన సమ్మెలో భాగంగా భద్రాచలంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు ధర్నా అనంతరం భద్రాచలం ఆర్డీవో దామోదర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా , పనిగంటలను పెంచుతున్నటువంటి ఈ లేబర్ కోడులను రద్దు చేయకపోతే కార్మికుల తరపున ఉద్యమాలు చేయటానికి వెనకాడమని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలియజేసేదేంటంటే గతంలో ఉన్నటువంటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా లేబర్‌ల విషయంలో ఇష్టానురాజ్యంగా వ్యవహరించి ముఖ్యమంత్రి పదవిని పోగొట్టుకోవడం జరిగిందన్నారు. అదే పరిస్థితి కాంగ్రెస్‌కు పట్టకుండా చూసుకోండని హితవు పలికారు. అంతేకాకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా విన్నవిచ్చేది ఏంటంటే పని దినాలు పెంచేటటువంటి ఈ 4 లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని కార్మికుల తరపున కార్మిక పక్షాల తరపున కోరుకుంటున్నామని తెలిపారు.

# నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి..!




**టీపీఎన్, మేడ్చల్ జిల్లా:** కేంద్రంలో మోదీప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త కార్మికుల సమ్మె పిలుపులో భాగంగా జీడిమెట్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎండీ యూసుఫ్ పాల్గొని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలు కార్మికులకు, కర్షకులకు, నిరుద్యోగులకు వ్యతిరేకమని.. కార్మిక సంఘాలను లేకుండా చేయడానికి 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా చేయాలని భావిస్తోందని ఆరోపించారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించకుండా, పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. దీన్ని వ్యతిరేకిస్తూ దేశంలో కార్మికులు నిర్వహించిన పోరాటాలను చల్లపరచడానికి ఏకీకృత పెన్షన్ విధానాన్ని తెచ్చిందని.. ఇది నూతన పెన్షన్ విధానం కంటే దారుణమన్నారు. జాతీయ కనీస వేతనం రోజుకు రూ.178గా నిర్ణయించి నెలకు రూ.4,628లతో సగటు ప్రజలు జీవించవచ్చని చెప్పినటువంటి దుర్మార్గపు ప్రభుత్వం బీజేపీదని దుయ్యబట్టారు. ప్రభుత్వం వెంటనే నెలకు 26 వేలని కనీస జీతం గా నిర్ణయించి, నూతన ఏకీకృత పెన్షన్లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అశోక్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే స్వామి, సీఐటీయూ మండల కార్యదర్శి కే లక్ష్మణ్, టీయూసీఐ నాయకులు ఈశ్వర్, ఏఐటీయూసీ నాయకులు నరసింహ రెడ్డి, తోపాటు వేలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాసబ్ చెరువు కింద నాలాను ఒక నమూనాగా తీర్చిదిద్దుతాం..!



**టీపీఎన్, హైదరాబాద్ :** మాసబ్‌చెరువు దిలావర్ఖాన్ - పెద్దఅంబర్‌పేట చెరువులను అనుసంధానం చేసే నాలాను ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. మొత్తం 7.50 కిలోమీటర్ల విస్తరించి ఉన్న ఈ నాలా పొడుగున చాలా అభివృద్ధి చెందాల్సిన పరిస్థితుల్లో.. ఇప్పుడు తగిన వెడల్పుతో నాలాను నిర్మిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవన్నారు. రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ యిలా సంబంధిత శాఖలన్నిటితో సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని అన్నారు. మాసబ్ చెరువు దిలావర్ఖాన్ చెరువుల మధ్య నాలా సరిగా లేక అనేక కాలనీలు నీట మునుగుతున్నాయనే పిర్యాదుల నేపథ్యంలో.. ఇబ్రహీంపట్నం ఎంఎల్ఏ శ్రీ మల్‌రెడ్డి రంగారెడ్డితో కలసి పలు ప్రాంతాలను బుధవారం కమిషనర్ పరిశీలించారు. మాసబ్ చెరువు దిలావర్ఖాన్ చెరువుల మధ్య జాలికుంట పరిసరాల్లో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కమిషనర్ చూసారు. జాలికుంటలో కట్టడం వల్ల సెల్లార్లోకి నీళ్లు చేరడంతో ఆగిపోయిన నిర్మాణాలను పరిశీలించారు.
చెరువుల మధ్య అనుసంధానంగా ఉన్న వరద కాలువలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇంకా పెద్దమొత్తంలో ఇళ్ల నిర్మాణాలు జరగలేదు కనుక భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నాలాను నిర్మించాల్సి ఉంటుందని సూచించారు. అలాగే చెరువుల ఆక్రమణ జరగకుండా చూడాలని అన్నారు. చెరువులలో మట్టిపోసి నింపినవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెరువుల, నాలాలను మనం కాపాడుకుంటే వరదలకు ఆస్కారం ఉండదని హితవు పలికారు. మాసబ్ చెరువులో మట్టి పోసినవారిపై చర్యలుంటాయని అన్నారు. అనంతరం కర్మాంఘాట్, బడంగిగిపేట ఏరియాల్లో నాలా విస్తరణకు ఉన్న ఆటంకాలను పరిశీలించారు. కర్మాంఘాట్ ప్రాంతంలోని ఉదయ్నగర్ కాలనీలో నాలా విస్తరణ వెంటనే చేపట్టాలని సూచించారు. అలాగే రావిర్యాల చెరువును పరిశీలించారు. చెరువు పైభాగంలో నివాసాలు నీట మునుగుతున్న నేపథ్యంలో చెరువు అలుగులను పరిశీలించారు.

## AI విప్లవానికి గ్రాఫిటీ సహకారం..

# భారత్‌కు పిలుపు..!

**టీపీఎన్ ప్రతినిధి** : అమెరికాలో ఒక లెక్చర్ సందర్శన సందర్భంగా, హ్యూస్టన్ విశ్వవిద్యాలయంలో నా స్నేహితుడు మరియు సహోద్యోగి సియమియన్ ఫజ్‌ట్‌లోవిచ్‌తో ఒకరితో ఒకరు ఆసక్తికరమైన ట్యుటోరియల్ జరిగింది. సియమియన్ నన్ను తాను అభివృద్ధి చేసిన గ్రాఫిటీ అనే అద్భుతమైన సాఫ్ట్‌వేర్‌ను పరిచయం చేశాడు. ఈ ప్రోగ్రామ్ గ్రాఫ్ సిద్ధాంతంలో—నోడ్స్ మరియు ఎడ్జెస్ యొక్క నెట్‌వర్క్‌లను అధ్యయనం చేసే గణిత శాఖలో—కొత్త మరియు సాధారణం కాని ఊహాగానాలను ఉత్పత్తి చేయగల సామర్థ్యం కలిగి ఉంది. నాకు, గ్రాఫిటీ 1980లు మరియు 1990లలో గణితం మరియు కంప్యూటర్ సైన్స్ రంగాలలో కృత్రిమ మేధస్సు (AI) యొక్క తొలి రూపాలలో ఒకటిగా కనిపించింది.

**గ్రాఫిటీ యొక్క AI సామర్థ్యాలు**

గ్రాఫిటీ యొక్క స్వయంచాలక రీజనింగ్ మరియు సృజనాత్మక సమస్యా పరిష్కార సామర్థ్యాలు AI యొక్క పలు లక్షణాలను ప్రదర్శించాయి. 1992 నాటికి, సియమియన్ గ్రాఫిటీని రసాయన శాస్త్రానికి కూడా విస్తరించాడు, ఇది అంతర్జాతీయ గుర్తింపు పొందింది. న్యూయార్క్ టైమ్స్ ఈ సాఫ్ట్‌వేర్ ప్రభావాన్ని హైలైట్ చేస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ గ్రాఫ్ సిద్ధాంతకారులు గ్రాఫిటీ ద్వారా ఉత్పత్తి చేయబడిన ఊహాగానాల రుజువులను ప్రచురించడం ప్రారంభించారు. ప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు పాల్ ఎర్డోస్ కూడా ఈ ఊహాగానాలపై పనిచేశాడు, ఈ సాఫ్ట్‌వేర్ యొక్క ప్రాముఖ్యతను రేఖాంకితం చేశాడు.

AI విప్లవానికి గ్రాఫిటీ యొక్క సహకారం

ఈ రోజు మనం చూస్తున్న AI విప్లవం, గ్రాఫిటీ వంటి తొలి వేదికలకు చాలా రుణపడి ఉంది, ఇవి డేటా సైన్స్, న్యూరల్ నెట్‌వర్క్‌లు, మరియు మెషిన్ లెర్నింగ్‌లలో తర్వాతి అభివృద్ధులకు బీజాలు నాటాయి. భారతదేశం ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో వాగ్దానాన్ని చూపించినప్పటికీ, ప్రేరణ లేని పాఠ్యప్రణాళికలు మరియు బౌద్ధిక ధైర్యం లేకపోవడం వల్ల AI విస్ఫోరణంలో పెద్దగా వెనుకబడిపోయింది. దశాబ్దాలుగా ఈ నిర్లక్ష్యం భారతదేశానికి భారీ ధరను చెల్లించవచ్చు.

**AI యొక్క ప్రస్తుత పురోగతి**

ప్రస్తుత AI విస్ఫోరణం ఒకవైపు ఉత్తేజకరంగా, మరోవైపు భయానకంగా ఉంది. మే మధ్యలో, యూకే మరియు యూఎస్ నుండి నిపుణులతో సహా సుమారు 30 ప్రముఖ గణిత శాస్త్రజ్ఞులు కాలిఫోర్నియాలోని బర్కిలీలో రహస్యంగా సమావేశమై, అత్యాధునిక రీజనింగ్ చాట్‌బాట్‌ను పరీక్షించారు. వర్జీనియా విశ్వవిద్యాలయం నుండి కెన్ ఒనో నాయకత్వంలో, ఈ గణిత శాస్త్రజ్ఞులు రెండు రోజుల పాటు AIకి ప్రొఫెసర్‌స్థాయి సవాలు సమస్యలను ఉంచారు. ఆశ్చర్యకరంగా, చాట్‌బాట్ ప్రతి సమస్యను పరిష్కరించింది, ఒక కష్టమైన PhDస్థాయి ప్రశ్నను కేవలం పది నిమిషాల్లో పరిష్కరించింది—ఇది అత్యంత ప్రతిభావంతమైన మానవ మేధావులను కూడా ఆకట్టుకునే సామర్థ్యం.

**AI యొక్క సవాళ్లు**

OpenAI యొక్క o4మినీ మోడల్‌పై ఆధారపడిన ఈ AI, అనేక మానవ నిపుణులను అధిగమించే అధునాతన రీజనింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. అయితే, ఒక ప్రమాదం ఉంది: దాని ఆత్మవిశ్వాసం మరియు అధికారిక స్పందనలు కొందరిని భయపెట్టవచ్చు, దాని పరిష్కారాలను పరిశీలన లేకుండా అంగీకరించేలా చేయవచ్చు. ఒనో హాస్యంగా చెప్పినట్లు, చాట్‌బాట్ "భయపెట్టడం ద్వారా రుజువు" చేయడంలో నైపుణ్యం సాధించింది.

భారత్‌కు ఒక పిలుపు

గణిత శాస్త్రజ్ఞులకు మరియు సమాజానికి, ఈ క్షణం ఉత్తేజకరమైనది మరియు అస్థిరమైనది. ఒకప్పుడు అభివృద్ధి చేయడానికి మరియు సాధన చేయడానికి దశాబ్దాలు పట్టిన సాధనాలు ఇప్పుడు క్షణాల్లో సంక్లిష్ట సమస్యలను పరిష్కరిస్తున్నాయి. తన గొప్ప బౌద్ధిక సంప్రదాయంతో, భారతదేశం ఈ సవాలును స్వీకరించాలి మరియు AIని కేవలం సాధనంగా కాక, ఆవిష్కరణలో భాగస్వామిగా స్వీకరించాలి, లేకపోతే ఈ రూపాంతర యుగంలో మరింత వెనుకబడిపోయే ప్రమాదం ఉంది.





# సవాళ్లకు దీటుగా యంగ్ టీమిండియా..!

**టీపీఎన్ ప్రతినిధి | బర్మింగ్‌హామ్**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్ సాధించిన ఉత్తేజకర విజయం తర్వాత ఒక చర్చ రగిలింది: కొత్త టీమ్ ఇండియా చివరకు తన శిఖరాన్ని చేరుకుంటోందా? ఈ యువ జట్టు చుట్టూ ఉన్న కథనం తీవ్రంగా మారింది—లీడ్స్‌లో ఓటమి తర్వాత తీవ్ర విమర్శలు, ఆపై బర్మింగ్‌హామ్‌లో చారిత్రక విజయం తర్వాత ఉత్సాహపూరిత ప్రశంసలు. అయితే, తీవ్ర భావోద్వేగాలలో కొట్టుకుపోకుండా, వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించే సమయం ఇది.

**లీడ్స్ ఓటమి మరియు ఎడ్జ్‌బాస్టన్ పునరాగమనం**

లీడ్స్ టెస్ట్ ఓటమి శుభమన్ గిల్ మరియు జట్టుపై అభిమానులు మరియు విమర్శకులలో నిరాశను కలిగించింది. అయితే, క్రికెట్ అనేది గెలుపోటములతో నిండిన క్రీడ. ముఖ్యంగా, రెండవ టెస్ట్‌లో భారత్ యొక్క ప్రతిస్పందన స్థిరత్వం, నేర్చుకోవడం, మరియు అనుసరణను చూపించింది. సాపేక్షంగా కొత్త కెప్టెన్ నాయకత్వంలోని ఈ యువ జట్టు గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. రవీంద్ర జడేజా తప్ప, ప్రస్తుత లైనప్‌లోని ప్రతి ఆటగాడు 34 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగినవాడు, ఇది రాబోయే సంవత్సరాల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే జట్టును సూచిస్తుంది.ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలవడం: ఒక సవాలు

ఉపఖండ జట్లకు ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలవడం అత్యంత కష్టమైన సవాలు. భారత్ చివరిసారిగా 2007లో రాహుల్ ద్రవిడ్ నాయకత్వంలో ఇంగ్లండ్‌లో సిరీస్ గెలిచింది. ఎంఎస్ ధోని మరియు విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలు కూడా అక్కడ సిరీస్ విజయాన్ని సాధించలేకపోయారు. ఈ సందర్భంలో, రెండవ టెస్ట్ విజయం మరింత ఆకట్టుకుంది—భారత్ అరుదైన అవే విజయాన్ని సాధించడమే కాక, ఇంగ్లండ్‌ను 336 పరుగుల తేడాతో ఘోరంగా ఓడించింది, ఇది రన్స్ పరంగా వారి అతిపెద్ద అవే విజయం. రికార్డు సృష్టించిన బ్యాటింగ్ మరియు బౌలింగ్ ఈ మ్యాచ్‌లో భారత్ అద్భుతంగా 1014 పరుగులు సాధించింది, ఇది ఒక టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు 1000 రన్స్ మార్కును దాటిన మొదటి సందర్భం. శుభమన్ గిల్ చరిత్ర సృష్టించాడు, ఒకే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ మరియు సెంచరీ సాధించిన తొలి టెస్ట్ ఆటగాడిగా నిలిచాడు. రిషభ్ పంత్ మరియు రవీంద్ర జడేజా కూడా కీలక సమయాల్లో ఫామ్‌లోకి వచ్చారు.

ఇంగ్లండ్ బౌలింగ్ దాడి, జోఫ్రా ఆర్చర్, ఒల్లీ స్టోన్, మరియు మార్క్ వుడ్ వంటి కీలక బౌలర్లు లేకపోవడంతో సతమతమైంది. భారత బౌలర్లు, స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేనప్పటికీ, అద్భుతంగా రాణించారు. ఆకాశ్ దీప్ మరియు మహ్మద్ సిరాజ్ ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్‌ను ధ్వంసం చేశారు. ఆకాశ్ దీప్ రెండు ఇన్నింగ్స్‌లలో 10 వికెట్లు తీసి, ఇంగ్లండ్‌లో భారత బౌలర్‌కు ఉత్తమ బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు. ఫ్లాట్ పిచ్‌పై వారి క్రమశిక్షణతో కూడిన, అవిశ్రాంత బౌలింగ్ ఒక మాస్టర్‌క్లాస్‌గా నిలిచింది. రాబోయే సవాళ్లుఇంగ్లండ్ దెబ్బతిన్నప్పటికీ, వారు తిరిగి బలంగా వస్తారని భావిస్తున్నారు. మూడవ టెస్ట్‌కు ఆర్చర్ తిరిగి రావచ్చు మరియు ఇతర బౌలర్లు ఫిట్‌నెస్ సాధించవచ్చు, ఇది ఆతిథ్య జట్టుకు బలాన్ని ఇస్తుంది. ఫ్లాట్ పిచ్‌లు మరియు కీలక ఆటగాళ్ల అనుపస్థితి ఇంగ్లండ్ యొక్క లోతును పరీక్షించాయి. అయినప్పటికీ, మూడు టెస్ట్‌లు మిగిలి ఉండటంతో, సిరీస్ ఫలితం ఇంకా నిర్ణయం కాలేదు. భారత్‌కు ఆత్మవిశ్వాసం ఉవ్వెత్తున ఉంది, చారిత్రక విజయం మరియు పూర్తిగా ఫిట్‌గా ఉన్న బుమ్రా తిరిగి వస్తే సిరీస్‌ను మరింత అనుకూలంగా మార్చవచ్చు.

**యువ జట్టు యొక్క బలం**

ఈ యువ భారత జట్టు ధైర్యం, ప్రతిభ, మరియు ఓటముల నుండి నేర్చుకునే సామర్థ్యాన్ని చూపించింది. ఎడ్జ్‌బాస్టన్ విజయం కేవలం స్కోర్‌బోర్డ్‌పై విజయం మాత్రమే కాదు; ఇది ఒక మానసిక బ్రేక్‌త్రూ, ఇంగ్లండ్ యొక్క దీర్ఘకాల ఆధిపత్యాన్ని భేదించింది. ఈ ఫామ్‌ను కొనసాగించి సిరీస్ విజయాన్ని సాధించగలరా అనేది చూడాల్సి ఉంది. కానీ ఒక విషయం స్పష్టం—ఈ టీమ్ ఇండియా తన లయను కనుగొంటోంది, ప్రపంచంలోని ఉత్తమ జట్లను వారి సొంత మైదానంలో సవాలు చేయడానికి సిద్ధంగా ఉంది.

# మెగా PTM 2.0 సరికొత్త అధ్యాయానికి నాంది..!

ఈ రోజు ప్రపంచంలో, వ్యక్తులు తమ "జీవన ప్రయాణాన్ని రూపొందించుకోవాలి" అనే ఆలోచనను ప్రోత్సహిస్తున్నారు, మరియు ఈ విజయానికి సూక్ష్మమైన ప్రణాళిక కీలకం. గత కొన్ని దశాబ్దాలుగా, "విద్యార్థి జీవితాన్ని రూపొందించడం" అనే భావన గణనీయమైన ఆదరణ పొందింది. అనేక ప్రైవేట్ విద్యా సంస్థలు, వ్యక్తిగతీకరించిన మార్గమే పిల్లల వ్యక్తిగత వృద్ధికి ఏకైక మార్గమని ఒప్పించే ప్రయత్నంలో ఉన్నాయి.

అయితే, వాస్తవం భిన్నంగా ఉంది. మధ్య మరియు తక్కువ ఆదాయ కుటుంబాల తల్లిదండ్రులు ఈ కథనానికి ఆకర్షితులై, దురదృష్టవశాత్తూ, ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేసింది. అయినప్పటికీ, ఉచిత ఆరోగ్యం మరియు విద్య అనేవి మంచి పాలన యొక్క ప్రాథమిక నిబద్ధతలుగా మిగిలాయి.

బాహ్య దృక్కోణం నుండి చూస్తే, ఆంధ్రప్రదేశ్‌లో గణనీయమైన సంఖ్యలో యువత ప్రతిష్టాత్మక IITలు మరియు ఇతర జాతీయ సంస్థలలో స్థానం సంపాదించారు. అయినప్పటికీ, ఈ సంస్థలను చేరాలని కలలు కనే విద్యార్థులలో వాస్తవంగా లక్ష్యాన్ని సాధించే వారి శాతం 3% కంటే తక్కువగా ఉంది, ఎందుకంటే చాలా మంది కోచింగ్ సంస్థల్లో చేరుతారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని మరియు యువతకు నిరాశను తెచ్చిపెడుతుంది, ఫలితంగా వారు రాష్ట్రంలోని ప్రైవేట్ వృత్తిపరమైన సంస్థల వైపు మొగ్గు చూపుతారు. ఈ మార్గాన్ని ఎంచుకున్న వారు తరచుగా తక్కువ జీతం గల ఉద్యోగాలతో జీవనం సాగించడానికి అవిశ్రాంత పోరాటం చేయాల్సి వస్తుంది.

**మెగా PTM 2.0: ప్రభుత్వ విద్యను పునరుజ్జీవనం చేయడం**

ఈ రోజు జరుగుతున్న మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్ (PTM) ప్రభుత్వ విద్యను పునరుజ్జీవనం చేయడానికి మరియు ప్రజల విశ్వాసాన్ని పునర్నిర్మించడానికి ఒక ఉద్దేశపూర్వక మరియు కీలకమైన చర్య. రెండు మెగా PTMలు మరియు రెండు త్రైమాసిక పేరెంట్‌టీచర్ సమావేశాల షెడ్యూల్, రాష్ట్ర భవిష్యత్ కార్యక్రమాలకు సంతోషకరమైన, విజయవంతమైన, మరియు సామర్థ్యవంతమైన మానవశక్తిని తీర్చిదిద్దేందుకు ఒక బాగా రూపొందిన వ్యూహాన్ని సూచిస్తుంది. ఇటువంటి చురుకైన చర్యలు లేకపోతే, మహారాష్ట్ర మరియు కర్ణాటక వంటి రాష్ట్రాలు ఎదుర్కొన్న సవాళ్లను ఆంధ్రప్రదేశ్ కూడా ఎదుర్కోవచ్చు, ఇక్కడ ఆర్థిక వృద్ధి మరియు సంపద దిగుమతి చేసుకున్న నైపుణ్య కార్మికులపై మరియు స్థానికుల నుండి తిరుగుబాట్లపై ఆధారపడుతున్నాయి.

**తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సహకారం**

ఈ ప్రయత్నంలో, సమాచారం కలిగిన తల్లిదండ్రి ప్రధాన పాత్ర పోషిస్తారు, మరియు తల్లిదండ్రులుఉపాధ్యాయుల సంయుక్త ప్రయత్నం పిల్లల భవిష్యత్తును వారి సహజ బలాలను ఉపయోగించుకుని, బలహీనతలను సవరించే విధంగా రూపొందించడంలో కీలకం. ఈ సహకారం సాంప్రదాయ విద్యను అధిగమిస్తూ, వ్యక్తిగత అభివృద్ధి ప్రయాణాన్ని ప్రోత్సహిస్తుంది, ఇది అభివృద్ధి చెందిన దేశానికి అవసరమైన మానవ వనరులను నిర్మించడానికి ఆధారం.

ప్రభుత్వ విద్యలో పునరుజ్జీవనం

మన ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క విఘాతకర శక్తి మరియు జనరేషన్ Z యొక్క సూక్ష్మ ప్రాధాన్యతలతో గుర్తించబడిన గ్లోబల్ యుగంలో ఎప్పుడో ఆలస్యమైన పునరుజ్జీవనాన్ని గుర్తించింది. ప్రతి విద్యార్థి యొక్క పురోగతిని సంపూర్ణంగా సమీక్షించడం ద్వారా, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు సహకరించి విద్యార్థి యొక్క అభ్యాస శైలి, బలాలు, మరియు బలహీనతలను సమగ్రంగా అర్థం చేసుకోవచ్చు. ఈ సహకార దృష్టి విజయాన్ని నిర్ధారిస్తుంది మరియు సరైన కెరీర్ ఎంపికలను సమాచారం చేస్తుంది, ఇంటిలో మరియు పాఠశాలలో వ్యక్తిగతీకరించిన మద్దతును అందిస్తుంది. ఈ సమన్వయం విద్యా పనితీరును మెరుగుపరుస్తుంది, ఉన్నత గ్రేడ్‌లను సాధిస్తుంది, మరియు జీవితకాల అభ్యాస ప్రేమను నాటుతుంది.

**హోలిస్టిక్ ప్రోగ్రెసివ్ కార్డ్**

ఈ రోజు సమావేశం యొక్క ప్రధాన లక్షణాలలో ఒకటి, రాష్ట్ర విద్యా శాఖ రూపొందించిన విద్యార్థి యొక్క హోలిస్టిక్ ప్రోగ్రెసివ్ కార్డ్ సమీక్ష. ఇది కేవలం విద్యా సమీక్షతో పాటు, విద్యార్థి యొక్క అకడమిక్ కాని, పాఠ్యేతర, మానసిక, మరియు శారీరక ఆరోగ్యాలను సమగ్రంగా అందిస్తుంది, ఇది విద్యార్థిని నిర్వచించడానికి మరియు భవిష్యత్తును రూపొందించడానికి ఒక ముఖ్యమైన మైలురాయి.

మానసిక శ్రేయస్సు మరియు కెరీర్ ఎంపికలు

ఈ సంవత్సరం, సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ యొక్క చురుకైన విద్యా నిర్వహణ బృందం కింద నియమించబడిన ఇన్‌హౌస్ శిక్షణ పొందిన మనస్తత్వవేత్తలు మరియు కెరీర్ నిపుణుల ద్వారా రాష్ట్రం మానసిక శ్రేయస్సు మరియు సమాచార కెరీర్ ఎంపికలను ప్రాధాన్యత ఇస్తోంది. ఈ రోజుల్లో చిన్న, న్యూక్లియర్ కుటుంబాలలో, ఇంటి మరియు పాఠశాల మధ్య స్థిరమైన సందేశాలు మరియు వ్యూహాలు చాలా ముఖ్యం. ఇవి పిల్లలకు సానుభూతి, స్థిరత్వం, ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక విలువలు, మరియు సమర్థవంతమైన సంభాషణ వంటి కీలకమైన సామాజికమానసిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. ఈ సమన్వయ విధానం కుటుంబాలు మరియు పాఠశాలలకు సమాచార నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని ఇస్తుంది, పిల్లలు సవాళ్లను ఎదుర్కోవడానికి, ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరచడానికి, మరియు వైవిధ్యమైన సామాజిక సెట్టింగులలో వృద్ధి చెందడానికి సన్నద్ధం చేస్తుంది.


పేరెంట్‌టీచర్ సమావేశాల లక్ష్యాలు

పేరెంట్‌టీచర్ సమావేశాల యొక్క ప్రధాన ఫలితాలను స్థిరత్వం, వనరుల విస్తరణ, మరియు సానుకూల పాఠశాల సంస్కృతిగా నిర్వచించవచ్చు.

LEAP: విద్యా శ్రేష్ఠతను నడిపించే సాధనం

ఈ అన్ని ప్రయత్నాలు LEAP (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) అనే బలమైన అప్లికేషన్ ద్వారా ఖచ్చితంగా పర్యవేక్షించబడుతున్నాయి, ఇది పాఠశాల నిర్వహణ మరియు ప్రణాళిక కోసం రూపొందించబడింది. అన్ని పురోగామి దేశాలు నాణ్యమైన డేటాపై ఆధారపడినట్లే, LEAP ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యా శ్రేష్ఠతను నడిపించి, బలమైన మరియు ఆర్థికంగా స్థిరమైన భవిష్యత్తును నిర్ధారిస్తుంది. గుర్తుంచుకోండి, విద్య అందరికీ, మరియు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం ఈ హక్కులను నిర్ధారిస్తుంది.

**గమనిక: ఈ కథనం రచయిత యొక్క దృక్కోణం మాత్రమే.**



**రామ్ కమల్,**
**సోషల్ ఇంజినీర్, సమగ్ర విద్య సలహాదారు,ఏపీ**

# రాజ్ థాకరే వ్యూహం..ఇరకాటంలో ఉద్ధవ్



**టీపీఎన్, ముంబై :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన దాదాపు 10% ఓట్లను, 20 సీట్లను సాధించింది. రాజ్ థాకరే పార్టీ ఎంఎన్ఎస్ తన ఖాతాను కూడా తెరవలేకపోయింది. రాజ్ థాకరే కుమారుడు కూడా ఎన్నికల్లో ఓడిపోయాడు. బీఎంసి ఎన్నికలకు ముందు, మరాఠీహిందీ వివాదం కారణంగా, థాకరే సోదరులిద్దరూ ఒకే వేదికపైకి వచ్చారు, కానీ రాజ్ థాకరే మారుతున్న స్వరం మళ్ళీ ఉద్ధవ్‌ను ఇబ్బందుల్లో పడేసింది. మరాఠీహిందీ భాషా వివాదంపై ముంబైలో జరిగిన రాజకీయ గందరగోళాన్ని సద్వినియోగం చేసుకోవడానికి, రాజ్ ,ఉద్ధవ్ థాకరే 20 సంవత్సరాల తర్వాత వేదికపైకి వచ్చారు. ఇద్దరు సోదరుల మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చినట్లు అనిపించింది. మరాఠీ భాష కోసం మేము ఎంతకైనా వెళ్తామని ఉద్ధవ్ అన్నారు. కానీ రాజ్ థాకరే అకస్మాత్తుగా తన వ్యూహాన్ని మార్చుకున్నాడు. ఏ కార్యకర్త లేదా నాయకుడు తనను అడగకుండా మీడియాతో మాట్లాడొద్దని రాజ్ థాకరే MNS కార్యకర్తలకు ట్వీట్ చేశారు. సోషల్ మీడియాలో కూడా ఎవరూ ఏమీ పోస్ట్ చేయొద్దని సూచించారు. ఒక విధంగా రాజ్ థాకరే హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని అంతం చేశారని అర్థమవుతోంది. ఆయన హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని పూర్తిగా ఆపకపోవచ్చు.. కానీ ఆయన వ్యూహం ఖచ్చితంగా మరాఠీహిందీ భాషా వివాదంలో కొత్త మలుపు తీసుకుంది.

గత కొన్ని రోజులుగా ముంబైలో హిందీ మాట్లాడేవారిని MNS కార్యకర్తలు కొడుతున్న తీరు కారణంగా దేశంలో వాతావరణం వేడెక్కిందని స్పష్టంగా తెలుస్తుంది. ర్యాలీలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే కూడా మరాఠీ భాష కోసం ఏ మేరకు అయినా వెళ్తానని చెప్పారు. కానీ రాజ్ థాకరే అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంపై కొత్త చిక్కులు వచ్చి పడే అవకాశం ఉంది.

**ఉద్ధవ్ థాకరే ఎక్కడా కనిపించడం లేదు**

2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో, ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన (UBT) 95 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. కానీ 20 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఇది శివసేన UBTకి పెద్ద ఎదురుదెబ్బ. మహాయుతి కూటమి (BJP, షిండే వర్గం, అజిత్ పవార్ NCP) 230+ స్థానాలను గెలుచుకోవడం ద్వారా వారిని అణగదొక్కింది. షిండే అసలు పార్టీ, ఎన్నికల చిహ్నాన్ని తీసుకున్న తర్వాత శివసేనకు మరిన్ని సీట్లు రావడంతో, మహారాష్ట్ర రాజకీయాల్లో ఉద్ధవ్ రాజకీయ ఔచిత్యం ప్రమాదంలో పడినట్లు అనిపించింది. దీని తర్వాత 2025 జూలై 5న జరిగిన మరాఠీ విజయ్ ర్యాలీలో ఉద్ధవ్, రాజ్ థాకరేతో వేదికను పంచుకున్నారు. ఈ చర్య మరాఠీ గుర్తింపు రక్షకుడిగా తన ఇమేజ్‌ను బలోపేతం చేసుకునే ప్రయత్నం. కానీ దానికి విరుద్ధంగా జరిగింది. హిందీ వ్యతిరేక వైఖరి మరాఠీయేతర ఓటర్లను ఆగ్రహానికి గురిచేసింది.

**రాజ్ థాకరే కోల్పోయేది ఏమీ లేదు,**

రాజ్ ఠాక్రే మహారాష్ట్ర నవనిర్మాణ సేన (MNS)లకు, మరాఠీహిందీ వివాదం ఖచ్చితంగా ఒక రాజకీయ అవకాశంగా మారింది. ఎందుకంటే వారు కోల్పోవడానికి ఏమీ లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో, ఆయన పార్టీ ఓట్ల శాతం కేవలం ఒక శాతం కంటే ఎక్కువ. వారు ఒక్క సీటు కూడా గెలవలేకపోయారు. ఆయన కుమారుడు కూడా తన స్థానాన్ని కోల్పోయాడు. దీనికి విరుద్ధంగా 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో, శివసేన UBT 10.03% ఓట్ల వాటాను పొందింది. పార్టీ అత్యంత ప్రతికూల సమయాల్లో కూడా 20 సీట్లను గెలుచుకోగలిగింది. కానీ ఈనెల 5న జరిగిన మరాఠీ విజయ్ ర్యాలీలో, రాజ్ థాకరే హిందీని మూడవ తప్పనిసరి భాషగా చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం ద్వారా మరాఠీ గుర్తింపు రక్షకుడి ఇమేజ్‌ను సృష్టించాడు. ఇది అతని ప్రధాన మరాఠీ ఓటర్ల స్థావరాన్ని బలపరుస్తుంది, ఇది MNS గుర్తింపుకు ఆధారం. అతి పెద్ద విషయం ఏమిటంటే, ఈ ర్యాలీలో, మరాఠీ గుర్తింపు రక్షకుడిగా అతని ఇమేజ్ అతని సోదరుడు ఉద్ధవ్ థాకరే కంటే ఎక్కువగా మారింది.

**ఆదిత్య థాకరే తన సీటును కాపాడుకోవడం కష్టమవుతుంది.**

హిందీ మాట్లాడేవారిని కొట్టాల్సిన అవసరం ఏమిటో ఇద్దరు నాయకులు ఒక్కసారి కూడా తమ కార్యకర్తలకు చెప్పలేదు. కానీ తన కుమారుడు ఆదిత్య థాకరే వర్లి అసెంబ్లీ వంటి పట్టణ ప్రాంతాల్లో, హిందీ మాట్లాడే , మరాఠీ కాని ఓటర్లు (సుమారు 3040%) ముఖ్యమని ఉద్ధవ్ థాకరే మర్చిపోయారు. థాకరే సోదరుల హిందీ వ్యతిరేక వైఖరి ఇక్కడ ఆగ్రహాన్ని పెంచుతుంది.

**కూటమిలో చీలిక వస్తుందా?**


శివసేన యుబిటి మహావికాస్ అఘాడిలో భాగం. కాంగ్రెస్, ఎన్‌సిపి కూడా ఈ కూటమిలో భాగం. కానీ ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే కలిసి వచ్చి మరాఠీ విజయ్ ర్యాలీలో హిందీ వ్యతిరేక వైఖరి తీసుకున్న తీరు మిత్రదేశాలను అసౌకర్యానికి గురిచేసింది. కాంగ్రెస్, ఎన్‌సిపి ర్యాలీకి దూరంగా ఉన్నాయి. సుప్రియా సులే అక్కడికి చేరుకున్నారు కానీ వేదికపై కనిపించలేదు. దీని కారణంగా కూటమిలో చీలిక వచ్చే అవకాశం పెరిగింది.

## ఛంగూర్ బాబా అరెస్ట్..
## 40 ఖాతాల్లో రూ. 106 కోట్లు..!



**టీపీఎన్, బలరాంపూర్ :** ఉత్తర ప్రదేశ్‌లో మత మార్పిడి ముఠాకు సూత్రధారి అయిన జమాలుద్దీన్ అలియాస్ ఛంగూర్ బాబా సామ్రాజ్యంలో పలు రాష్ట్రాలకు విస్తరించింది. ఒకప్పుడు తన సైకిల్‌పై ఉంగరాలు, తాయెత్తులు అమ్మేవాడు. ఇప్పుడు అతని దగ్గర 40 బ్యాంకు ఖాతాల్లో రూ. 106 కోట్ల విలువైన నిధులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్ జిల్లాలో ఇటీవల బయటపడిన మతమార్పిడి రాకెట్‌కు సంబంధించి ఛంగూర్ బాబా, అతని సన్నిహితురాలు నీతు అలియాస్ నస్రీన్‌లను లక్నోలోని ఒక హోటల్‌లో అరెస్టు చేశారు. జమాలుద్దీన్ అరెస్టు అయినప్పటి నుండి అతని చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది."పేద, నిస్సహాయ కార్మికులు, బలహీన వర్గాలు, వితంతువు మహిళలను ప్రోత్సాహకాలు, ఆర్థిక సహాయం, వివాహ హామీలతో ఆకర్షించడం లేదా బెదిరింపుల ద్వారా బలవంతంగా మత మార్పిడికి ప్రోత్సహించేవాడని పోలీసులు తెలిపారు. ఈ ముఠాకు ఏదైనా ఉగ్రవాద సంబంధాలు ఉన్నాయా అని యుపి ఉగ్రవాద నిరోధక దళం (ఎటిఎస్) కూడా దర్యాప్తు చేస్తోంది. ఈ ముఠాపై కేసు నమోదు చేసిన యుపి స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) కూడా ఈ విషయంపై దర్యాప్తు చేస్తోంది. బలరాంపూర్‌లోని ఈ ముఠాతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఇతర వ్యక్తులను కూడా స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

ఈ మూడు ఏజెన్సీలతో పాటు, పీర్ బాబా అని కూడా పిలువబడే ఛంగూర్ బాబా ఆదాయ మార్గాలను తెలుసుకోవడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) కూడా కేసు నమోదు చేసింది. పలు బ్యాంకు ఖాతాల్లో జమ అయిన డబ్బును ఎవరు పంపారు, ఏ కారణాల వల్ల పంపారు అనే దానిపై ఏజెన్సీ దర్యాప్తు చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని రెహ్రా మాఫీ గ్రామానికి చెందిన ఛంగూర్ బాబా సామ్రాజ్యం మొత్తం నేపాల్ సరిహద్దులో ఉన్న బలరాంపూర్ జిల్లాలోని ఉత్తరౌలా ప్రాంతంలో ఉంది. బాబాకు పలు రాష్ట్రాల్లో కూడా అనేక ఆస్తులు ఉన్నాయి. ఒకటి మహారాష్ట్రలోని లోనావాలాలో ఉంది. దీనిని చంగూర్ బాబా నవీన్ పేరుతో కొనుగోలు చేశారు.ఈ భూమి ధర రూ. 16. 49 కోట్లు. ఆ భూమిని మహ్మద్ అహ్మద్ ఖాన్ అనే వ్యక్తి విక్రయించాడు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించిన విషయాలలో ఎటువంటి రాజీ లేదని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఛంగూర్ బాబా ముఠాతో సంబంధం ఉన్న ఇతర నేరస్థుల ఆస్తులను స్వాధీనం చేసుకుని..వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.






## సీఎం రేఖా గుప్తా నివాసం పునరుద్ధరణ రద్దు..!

**టీపీఎన్, న్యూఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా అధికారిక నివాసం పునరుద్ధరణ కోసం జారీ చేసిన రూ.60 లక్షల టెండర్‌ను ఢిల్లీ ప్రభుత్వ ప్రజా పనుల శాఖ రద్దు చేసింది. జులై 7న ఆ శాఖ జారీ చేసిన అధికారిక నోటిఫికేషన్ ద్వారా ఈ నిర్ణయం తీసుకున్నారుఈ టెండర్ జులై 4న తెరవాల్సి ఉండగా, పరిపాలనా కారణాల వల్ల టెండర్ రద్దు చేయబడింది. ముఖ్యమంత్రి బంగ్లాలో ఎలక్ట్రికల్ ఫిట్టింగ్‌లు, ఇతర సాంకేతిక పనులు పూర్తి చేయాలనే ప్రణాళిక ఉంది. దీని కోసం రూ. 60 లక్షల టెండర్ జారీ చేయబడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేఖ గుప్తా బాధ్యతలు స్వీకరించారు, జూన్ నెలలో ఆమెకు రాజ్ నివాస్ మార్గ్‌లో ఉన్న బంగ్లా నంబర్ 1 కేటాయించారు. ఈ బంగ్లా టైప్7 కేటగిరీకి చెందినది. ఈ ఖర్చును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించడంతో టెండర్ రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. టెండర్ జారీ చేసిన తర్వాత, ఆమ్ ఆద్మీ పార్టీ , కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వం 'మాయా మహల్' , 'రంగ్ మహల్' నిర్మించిందని ఆరోపించాయి అయితే విపక్ష నేతల కమలనాథులు ఖండించారు. ఢిల్లీ ప్రభుత్వ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (PWD) జులై 1న జారీ చేసిన టెండర్ ప్రకారం, ముఖ్యమంత్రి రేఖ గుప్తా ప్రభుత్వ బంగ్లా పునరుద్ధరణ మొదటి దశ జులై మొదటి వారం నుండి ప్రారంభం కావాల్సి ఉంది. ఇందులో ప్రధానంగా విద్యుత్ పనులు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలో 80 లైట్స్, ఫ్యాన్ పాయింట్ల పూర్తి వైరింగ్, ఒక్కొక్కటి రెండు టన్నుల బరువున్న 24 ఎయిర్ కండిషనర్ల సంస్థాపన (దీని ధర రూ. 11 లక్షల కంటే ఎక్కువ), 23 ప్రీమియం ఇంధనసమర్థవంతమైన సీలింగ్ ఫ్యాన్లు , 16 వాల్ మౌంటెడ్ ఫ్యాన్లు ఉన్నాయి.

# గుజరాత్ లో కుప్పకూలిన వంతెన.. 10 మృతి, పలువురికి గాయాలు




గుజరాత్‌లోని వడోదర జిల్లాలో పెను ప్రమాదం జరిగింది. మహి నదిపై ఉన్న పాత వంతెన కూలిపోయింది. మహిసాగర్ నదిపై ఉన్న గంభీర బ్రిడ్జి ఒక్క సారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో 10 మంది చనిపోయారు. పలువురు గల్లంతయ్యారు. నిత్యం రద్దీగా ఉండే బ్రిడ్జి కావడంతో.. కూలిపోయే సమయంలో వంతెనపై ఉన్న కార్లు, ట్రక్కులు, బస్సులు, బైకులు నదిలో పడిపోయాయి. ఈ వంతెన సెంట్రల్ గుజరాత్‌ను సౌరాష్ట్రతో కలిపే కీలకమైన పాద్రాముజ్పూర్ రహదారిపై ఉంది.

గంభీర బ్రిడ్జి సుమారు 40 ఏళ్ల పాతది. 1983-84లో నిర్మించారు. పాత వంతెన కావడంతో ప్రమాదకరంగా మారుతోందని అనేక సార్లు నివేదికలు అందినా గుజరాత్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ వంతెన సౌరాష్ట్ర ట్రాఫిక్‌కు కీలకం. ఈ వంతెన పాతబడిపోయిందని.. కొత్తది నిర్మించాలన్న డిమాండ్లు చాలా కాలంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. భారీ వాహనాలు కూడా ఈ వంతెన మీద నుంచే వెళ్తుంటాయి. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు 4 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల పరిహారం ప్రకటించారు గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్. ఇటీవల కాలంలో గుజరాత్ లో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. 2022 మోర్బీ బ్రిడ్జి నిర్మాణ లోపాలు, అధిక లోడ్ కారణంగా కూలిపోయింది. అది 100 ఏళ్ల పాత బ్రిడ్జి. ఈ ప్రమాదంలో 135 మంది మరణించారు. ఆనంద్ జిల్లాలో ముంబైఅహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో నిర్మాణంలో ఉన్న తాత్కాలిక నిర్మాణం 2024 నవంబర్ 5న కూలిపోయి, ముగ్గురు కార్మికులు మరణించారు. వరుస ప్రమాదాలు గుజరాత్ అభివృద్ధి నమూనాను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఎపుడో దశాబ్దాల కిందట కట్టిన ఇన్‌ఫ్రా తప్ప.. గుజరాత్ లో కొత్త ఏమీ నిర్మించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.




# మరోసారి పాక్ పరువుపాయే..!

పాకిస్తాన్ మరోసారి అడ్డంగా దొరికిపోయింది. ఉగ్రవాదులకు పాకిస్తాన్ స్వర్గధామమని యావత్ ప్రపంచానికి తెలుసు. కానీ, పాకిస్తాన్ ప్రభుత్వం, నాయకులు మాత్రం అంగీకరించరు. ఉగ్రవాదులను యోధులుగా, స్వాతంత్ర్య పోరాట యోధులుగా చెప్పుకుంటుంది. అయితే, అప్పుడప్పుడు పాకిస్తాన్ నైజం బయటపడుతున్నది. ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ ఖర్ ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ జరిపిన వైమానిక దాడుల్లో మరణించిన ఉగ్రవాదులకు అంత్యక్రియల్లో పాల్గొన్న లష్కర్ ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ ఉగ్రవాది కాదని.. ఆయన సామాన్యుడని హీనా రబ్బానీ ఖర్ అల్ జజీరాతో ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.జర్నలిస్ట్ లష్కర్ ఎ తోయిబా ఉగ్రవాది హాఫీజ్ సయీద్ సన్నిహితుడు అబ్దుల్ రవూఫ్ అంత్యక్రియల్లో ప్రార్థనలు చేస్తున్న దృశ్యాలు, ఆయన వెనుక పాక్ సైన్యం, పోలీస్ ఉన్నతాధికారులు ఉన్న చిత్రాలను ఆమెకు చూపించారు. సదరు వ్యక్తి అమెరికా ప్రకటించిన ఉగ్రవాది అంటూ జర్నలిస్ట్ పేర్కొన్నారు. దీనికి హీనా రబ్బాని స్పందిస్తూ.. అంతర్జాతీయ ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ కాదని.. పాక్‌కు చెందిన సామాన్య వ్యక్తి అని తెలిపారు. పాకిస్తాన్‌లో లక్షలాది మంది అబ్దుల్ రవూఫ్‌లు ఉన్నారని.. తాను పూర్తి అధికారంతో ఈ విషయాన్ని చెబుతున్నానన్నారు. పాక్ సైన్యం స్వయంగా విలేకరుల సమావేశం నిర్వహించిందని.. ఆ వ్యక్తి ఉగ్రవాది కాదంటూ సైన్యం ఖండించలేదని జర్నలిస్ట్ గుర్తు చేశారు. పాక్ సైన్యం చిత్రంలో కనిపించిన వ్యక్తి నేషనల్ ఐడీని సైతం చూపించారు. అమెరికా ప్రకటించిన ఉగ్రవాది ఐడీతో సరిపోయిందని చెప్పగా.. హీనా రబ్బాని ఒక్కసారిగా నీళ్లు నమిలింది.. ఆమెకు ఏం చెప్పాలో తెలియక పాత విషయాలనే చెప్పుకువచ్చింది. ఆధారాలతో సహా ఉగ్రవాది గురించి బయటపెట్టడంతో షాక్‌కు గురయ్యారు. అమెరికా ప్రకటించిన ఉగ్రవాది ఫొటోలో కనిపించిన వ్యక్తి కాదంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దాంతో పాకిస్తాన్ ప్రభుత్వం ఉగ్రవాదులకు మద్దతు ప్రకటిస్తుందనే విషయం మరోసారి తేలిపోయింది.



# ప్రధాని మోదీకి నమీబియా అత్యున్నత పౌర పురస్కారం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మరో అరుదైన గౌరవం లభించింది. నమీబియా పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విచ్చియా మిరాబిలిస్'ను ప్రధానం చేశారు. నమీబియా అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నందిఎన్ ద్వైతా ఈ అవార్డును మోదీకి అందజేశారు. నమీబియాతో పాటు ప్రపంచ శాంతి, న్యాయం, సామాజిక ఆర్థిక అభివృద్ధికి మోదీ చేసిన సేవలను అధ్యక్షురాలు ప్రశంసించారు. నమీబియా అత్యున్నత పౌర పురస్కారం 'వెల్‌విచ్చియా మిరాబిలి'తో అందుకోవడం చాలా ఆనందంగా ఉందని మోదీ అన్నారు. నమీబియా అధ్యక్షురాలు, ప్రభుత్వం, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశంలోని 140 కోట్ల మంది భారతీయుల తరఫున ఈ పురస్కారాన్ని అందుకుంటున్నానని చెప్పారు. ఇండియానమిబియా మధ్య ఎప్పటికీ చెక్కుచెదరని చిరకాల స్నేహం ఉందని, ఇక్కడ అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తనకు ఇచ్చిన పురస్కారాన్ని నమీబియా, ఇండియా ప్రజలకు అంకితమిస్తున్నానని తెలిపారు. కష్టకాలంలో ఉన్నప్పుడు చేయూత నిచ్చినవారే నిజమైన మిత్రులని, స్వాతంత్ర్య పోరాటం సమయం నుంచి కూడా ఒకరికొకరు బాసటగా ఇండియా, నమీబియా నిలబడ్డాయని చెప్పారు. ఇరుదేశాల మైత్రి రాజకీయాల నుంచి పుట్టిన మైత్రి కాదని, పరస్పరం ఎదుర్కొన కష్టాలు, సహకారం, పరస్పరం విశ్వాసం నుంచి బలపడందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇరుదేశాలు మైత్రీ సంబంధాలతో అభివృద్ధి పథం దిశగా పయనించనున్నాయని అన్నారు.



# ఇరాన్ అణు బాంబు తయారీకి రెడీ..?

- **ఆందోళనలో అమెరికా, ఇజ్రాయెల్**
- **అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అనుమతి లేదు**
- **అణుబాంబులు తయారు చేయాలంటే ఎవరూ ఆపలేరన్న ఖమేనీ**



అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (IAEA)తో సహకరించకూడదని ఇరాన్ నిర్ణయించింది. గత నెలలో ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ , అమెరికా దాడుల తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. IAEAతో సహకారాన్ని రద్దు చేస్తూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ఒక చట్టంపై సంతకం చేశారు.

**ఇరాన్ కొత్త చట్టం**

ఇజ్రాయెల్‌తో ఇరాన్ కాల్పుల విరమణకు ఒక రోజు తర్వాత జూన్ 24న ఇరాన్ పార్లమెంట్ IAEAతో సహకారాన్ని ముగించాలని అత్యధికంగా ఓటు వేసింది. ఈ చట్టం ఇప్పుడు అమల్లోకి వచ్చిందని అక్కడి మీడియా చెబుతోంది. దీంతో ఇరాన్ అణు కార్యక్రమం ఇకపై అంతర్జాతీయ పర్యవేక్షణలో ఉండదు. అటువంటి పరిస్థితిలో, ఇరాన్ తన అణు మిషన్‌ను రహస్యంగా కొనసాగించవచ్చు. అణుశక్తిని కలిగి ఉండాలా వద్దా అని మరే ఇతర దేశం తనకు చెప్పకూడదని ఇరాన్ ఇప్పటికే చెప్పేసింది.

**IAEA నుండి విడిపోయిన తర్వాత**

ఇరాన్ పార్లమెంటులో ఆమోదించబడిన తీర్మానం ప్రకారం IAEA నుండి విడిపోయిన తర్వాత దాని ఇన్స్పెక్టర్లు ఇకపై ఇరాన్ అణు కేంద్రాలను తనిఖీ చేయలేరు. దీని అర్థం ఇరాన్ రహస్యంగా తన అణు కార్యక్రమాన్ని కొనసాగిస్తే IAEA ఇకపై దాని అణు కార్యక్రమం ఏ స్థాయికి చేరుకుందో దాని గురించి సమాచారాన్ని పొందలేకపోతుంది. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ మాట్లాడుతూ IAEA ఇన్స్పెక్టర్లు ఇరాన్‌లో ఉన్నారని .. వారు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. కానీ వారి కార్యకలాపాలు నిలిపివేశామన్నారు. మా సైట్‌లను యాక్సెస్ చేయడానికి అనుమతించబోమని తేల్చిచెప్పారు. ఇప్పుడు IAEA ఇన్స్పెక్టర్లు ఇరాన్ అణు కేంద్రాలను చేరుకోవాలనుకుంటే, వారు ఇరాన్ అత్యున్నత సంస్థ అయిన జాతీయ భద్రతా మండలి నుండి అనుమతి తీసుకోవాలి.

**ఇరాన్ అణు బాంబు తయారీ.?**

ఇరాన్‌లోని ఫోర్డో, నటాంజ్ , ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై దాడి తర్వాత, ఇరాన్‌లోని 400 కిలోల యురేనియం అదృశ్యమైంది. అది 9 అణు బాంబులను తయారు చేయడానికి తగినంత యురేనియం ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ఇరాన్ వద్ద ఇప్పటికే తగినంత యురేనియం ఉంది. 60 శాతం వరకు యురేనియంను సుసంపన్నం చేసిందని IAEA ఇప్పటికే తెలిపింది. ఎటువంటి అంతర్జాతీయ పర్యవేక్షణ లేనప్పుడు, ఇరాన్ తన సుసంపన్నత స్థాయిని 90 శాతానికి తీసుకువెళితే, అది అణు బాంబును తయారు చేసే సామర్థ్యాన్ని సాధించగలదు. అయితే ఇందులో ఇంకా చాలా అడ్డంకులు ఉన్నాయి.

**శాంతియుత ప్రయోజనాల కోసమే..**

ఇరాన్ ప్రస్తుతం అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (NPT)లో సభ్యదేశంగా ఉంది. ఈ సభ్యత్వం దానికి అణుశక్తిని శాంతియుతంగా ఉపయోగించుకునే హక్కును ఇస్తుంది. కానీ అది అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా నిరోధిస్తుంది. ఈ హక్కులో యురేనియం సుసంపన్నం, అణు పరిశోధన కూడా ఉన్నాయి. ఆయుధ తయారీ కోసం కానట్లయితే అణు సాంకేతికత, సామగ్రిని యాక్సెస్ చేసే హక్కు దీనికి ఉంది. కానీ ఇలా చేయాలంటే ఇరాన్ తన కార్యక్రమం శాంతియుతంగా కొనసాగాలంటే IAEA పర్యవేక్షణను అంగీకరించాలి. ఇరాన్ తన అణు కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఎల్లప్పుడూ చెబుతూనే ఉంది. కానీ శాంతియుత అణు పనులకు, 5% యురేనియం సుసంపన్నం సరిపోతుంది. అయితే ఇరాన్ 60% వరకు యురేనియంను సుసంపన్నం చేసింది. అందువల్ల దాని వాదన అనుమానాస్పదంగా ఉంది. ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ కూడా తాను బాంబు తయారు చేయాలనుకుంటే, ప్రపంచ నాయకులు తనను ఆపలేరని అన్నారు.

**ఇరాన్ అణు కార్యక్రమాలను తిరిగి ప్రారంభిస్తే..**

ఇరాన్ తన అణు కార్యక్రమాలను తిరిగి ప్రారంభించే విషయానికి వస్తే నటాంజ్‌లో ఉన్న అణు సెంట్రిఫ్యూజ్‌లు అమెరికా, ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమయ్యాయి. అటువంటి పరిస్థితిలో, సుసంపన్నం చేయడం దానికి అంత ఈజీ కాదు. కానీ ఇరాన్ యొక్క కొన్ని రహస్య అణు కేంద్రాలు ఇప్పటికీ సురక్షితంగా ఉన్నాయని చెబుతారు. కుహ్‌ఎకోలాంగ్ గజ్‌లా అనేది నటాంజ్ నుండి కొద్ది దూరంలో పర్వతాల మధ్యలో ఉన్న అణు కేంద్రం. ఇరాన్ ఈ కేంద్రాన్ని లేదా ఇలాంటి ఏదైనా కేంద్రాన్ని తిరిగి సక్రియం చేస్తే, ఈ దశ అమెరికా, ఇజ్రాయెల్ యొక్క ఆందోళనను పెంచుతుంది.

**అమెరికా-ఐక్యరాజ్యసమితి ఏం చెప్పింది?**

ఇరాన్ కు అణు బాంబు తయారు చేసే హక్కు లేదని ట్రంప్ ఎప్పుడూ చెబుతూనే ఉన్నారు. IAEA నుండి ఇరాన్ విడిపోవడంపై, ఇది ఆమోదయోగ్యం కాదని అమెరికా పేర్కొంది. తన వైఖరిని మార్చుకుని శాంతి , శ్రేయస్సు మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉన్న సమయంలో IAEA తో సహకారాన్ని నిలిపివేయాలని నిర్ణయించుకుందని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ కె. బ్రూస్ అన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ ప్రతినిధి ఈ నిర్ణయం స్పష్టంగా ఆందోళనకరంగా ఉందన్నారు.

**ఇరాన్ ఎంత వేగంగా అణు బాంబును తయారు చేయగలదు?**

ఇజ్రాయెల్ దాడిలో చాలా మంది అగ్రశ్రేణి ఇరాన్ అణు శాస్త్రవేత్తలు మరణించారు. ఇది ఖచ్చితంగా ఇరాన్ లక్ష్యాన్ని దెబ్బతీసింది. కానీ దాని మౌలిక సదుపాయాలకు ఎంత నష్టం జరిగిందనే దానిపై స్పష్టమైన సమాచారం లేదు. అయితే, అమెరికాఇజ్రాయెల్ దాడి ఇరాన్ అణు కార్యక్రమాన్ని కనీసం 2 సంవత్సరాలు వెనక్కి నెట్టిందని అమెరికా ఖచ్చితంగా చెబుతోంది.



# తాలిబాన్ ప్రభుత్వానికి రష్యా మద్దతు

రష్యా ఒక చారిత్రాత్మక అడుగు వేసి ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించింది. ఇప్పటివరకు ఏ దేశం కూడా తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించకపోవడంతో ఈ చర్య ప్రపంచ రాజకీయాల్లో ఒక మలుపుగా పరిగణించబడుతుంది. తాలిబన్లు నియమించిన కొత్త ఆఫ్ఘన్ రాయబారి గుల్ హసన్ హసన్‌ను అంగీకరిస్తూ రష్యా ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. దీంతో, తాలిబన్ పాలనను అధికారికంగా గుర్తించిన మొదటి దేశంగా రష్యా నిలిచింది. 2021 ఆగస్టులో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ అధికారంలోకి వచ్చింది.ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వానికి అధికారిక గుర్తింపు లభించడం వల్ల రెండు దేశాల మధ్య వివిధ రంగాలలో నిర్మాణాత్మక ద్వైపాక్షిక సహకారం పెరుగుతుందని విశ్వసిస్తున్నామని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా ఉప విదేశాంగ మంత్రి ఆండ్రీ రుడెంకో మాస్కోలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో గుల్ హసన్ హసన్‌ను కలిశారు. కాబూల్‌లోని తాలిబన్ అధికారులు రష్యా చర్యను స్వాగతించారు. ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. తాలిబన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకి మాట్లాడుతూ ఇది రెండు దేశాల సంబంధాల చరిత్రలో ఒక పెద్ద విజయంగా అభివర్ణించారు. 2021 ఆగస్టులో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రష్యా కాబూల్‌లోని తన రాయబార కార్యాలయాన్ని తెరిచి ఉంచింది. తాలిబన్ నాయకత్వంతో సంబంధాలు కొనసాగిస్తుంది. వాణిజ్యం, ఆర్థిక రంగాలలో సహకారాన్ని పెంపొందుతుందని భావిస్తున్నారు. ఇంధనం, రవాణా, వ్యవసాయం , మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో పనిచేయాలని యోచిస్తోందని రష్యా ప్రభుత్వం తెలిపింది. దీంతో పాటు విద్య, సంస్కృతి, క్రీడలు , మానవతా రంగాలలో సంబంధాలను బలోపేతం చేయాలనే కోరిక కూడా వ్యక్తమైంది.ఇప్పటివరకు ఏ దేశం కూడా తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించలేదు. చాలా దేశాలు తాలిబన్లు అంతర్జాతీయ ప్రమాణాలకు, ముఖ్యంగా మానవ హక్కుల విషయాలకు తమ నిబద్ధతను ప్రదర్శించాలని ఎదురు చూస్తున్నాయి. రష్యా తాలిబన్లను గుర్తించినప్పటికీ, వారి మానవ హక్కుల రికార్డును మెరుగుపరచుకోవాలని తాలిబన్లపై ఇప్పటికీ ప్రపంచవ్యాప్త ఒత్తిడి ఉంది.

# షేక్ హసీనా ఆడియో లీక్..

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సంబంధించిన ఒక కీలకమైన ఆడియో లీక్ కావడంతో రాజకీయంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గతేడాది జరిగిన ఆందోళనల సమయంలో నిరసనకారులపై కాల్పులు జరపాలని ఆమె స్వయంగా ఆదేశించినట్లు ఈ ఆడియోలో ఉంది. ఇప్పుడు బంగ్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.బంగ్లాదేశ్‌లో, అప్పటి ప్రధాన మంత్రి షేక్ హసీనా గత సంవత్సరం విద్యార్థి నిరసనకారులను నియంత్రించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. మాజీ ప్రధాని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారితో చేసిన సంభాషణ యొక్క లీకైన ఆడియో, నిరసనకారులను వేటాడి కాల్చి చంపాలని ఆమె ఆదేశించినట్లు సూచిస్తుంది. ఈ వీడియో షేక్ హసీనా ఇబ్బందులను మరింత పెంచుతుంది. ఆమె ఇప్పటికే సామూహిక హత్యల కేసులో విచారణను ఎదుర్కొంటోంది. నిరసనకారులను అణచివేయడానికి ప్రాణాంతక ఆయుధాలు వాడండి. వాళ్లు ఎక్కడ కనిపిస్తే అక్కడ కాల్చేయండి అని ఆమె ఆదేశించారు. ఈ ఆదేశాలు జారీ అయిన కొద్ది



గంటలకే పోలీసులు నిరసనకారులపై బలప్రయోగం చేసింది.కాగా, బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి తీవ్ర అల్లర్లకు దారితీశాయి. ఈ ఘర్షణల్లో సుమారు 1,400 మంది మరణించినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఈ నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో హసీనా ప్రభుత్వం కుప్పకూలింది. అనంతరం ఆమె దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అయితే బంగ్లాదేశ్ ఆమెను అప్పగించాలని భారతదేశానికి అధికారికంగా అభ్యర్థన పంపింది. కానీ ప్రస్తుతానికి ఈ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.ప్రస్తుతం మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం హసీనాను తిరిగి దేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆమెపై బంగ్లాదేశ్‌లో ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. తిరుగుబాటు తరువాత, గత ప్రభుత్వంలోని చాలా మంది అవామీ లీగ్ నాయకులు , అనేక మంది అధికారులను అరెస్ట్ చేశారు. కొంతమంది విదేశాలకు పారిపోయారు. తాత్కాలిక ప్రభుత్వం వారిపై క్రూరమైన అణచివేతకు సంబంధించి విచారణలు ప్రారంభించింది,. దీని ఫలితంగా ఆగస్టు 5న 15 ఏళ్లకు పైగా ఉన్న అవామీ లీగ్ ప్రభుత్వం కూలిపోయింది.

**అవామీ లీగ్ స్పందించింది**

తిరుగుబాటు సమయంలో సామూహిక హత్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హసీనాను బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రిబ్యునల్ విచారిస్తోంది. కాబట్టి ప్రాసిక్యూటర్లు ఆమెకు వ్యతిరేకంగా ఆడియోటేప్‌ను కీలక సాక్ష్యంగా ఉపయోగించాలని యోచిస్తున్నారు. బంగ్లాదేశ్‌ను విడిచిపెట్టిన తర్వాత ఆమె చేసిన మొదటి ప్రకటనలో, హసీనా తాను నిర్దోషినని ప్రకటించుకుంది. కానీ ఇటీవల లీక్ అయిన ఆడియో నిరసనకారుల కోసం 'కనిపించగానే కాల్చివేయండి అనే ఆదేశాలను హసీనా నేరుగా ఇచ్చినట్లు సూచిస్తుంది. బీబీసీ లీక్ చేసిన ఆడియోను అవామీ లీగ్ ప్రతినిధి తిరస్కరించారు. లీక్ అయిన ఆడియో నిరాధారమైనది.. చట్టవిరుద్ధమని పార్టీ పేర్కొంది.



# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్!

**టీపీఎన్, ముంబై :**

భారత స్టాక్ మార్కెట్ బుధవారం ఉదయం మిశ్రమ గ్లోబల్ సూచనలు మరియు గ్లోబల్ వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో బలహీనంగా ప్రారంభమైంది. ఉదయం 9:34 గంటల సమయంలో, BSE సెన్సెక్స్ 181.63 పాయింట్లు లేదా 0.22% తగ్గి 83,530.88 వద్ద ట్రేడవుతోంది. అదేవిధంగా, NSE నిఫ్టీ 44.25 పాయింట్లు లేదా 0.17% తగ్గి 25,478.25 వద్ద ఉంది.

విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, గ్లోబల్ వాణిజ్య ఒత్తిడులు మరియు సుంకాలపై స్పష్టత లేకపోవడం వల్ల మార్కెట్ బలహీనంగా ప్రారంభమైంది. "నిఫ్టీకి 25,500 వద్ద సపోర్ట్ ఉండవచ్చు, ఆ తర్వాత 25,400 మరియు 25,300 స్థాయిలు సపోర్ట్‌గా ఉంటాయి. అదే సమయంలో, 25,600 వద్ద తక్షణ నిరోధకం, ఆపై 25,700 మరియు 25,800 స్థాయిలు నిరోధకంగా ఉంటాయి," అని చాయిస్ బ్రోకింగ్‌కు చెందిన హార్దిక్ మటాలియా తెలిపారు.

ఇటీవలి గ్లోబల్ పరిణామాల్లో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫార్మాస్యూటికల్స్‌పై 200% మరియు కాపర్ ఉత్పత్తులపై 50% సుంకాలను ప్రతిపాదించారు. దీని ప్రభావంతో కాపర్ ఫ్యూచర్స్ 17% కంటే ఎక్కువగా పెరిగి, తర్వాత స్థిరీకరణకు చేరుకున్నాయి. ఈ సుంకాలపై మరింత స్పష్టత వచ్చే వరకు మార్కెట్లు జాగ్రత్తగా ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు.

నిఫ్టీ బ్యాంక్ సూచీ 196.25 పాయింట్లు లేదా 0.34% తగ్గి 57,060.05 వద్ద ఉంది. విస్తృత సూచీలలో, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 72 పాయింట్లు లేదా 0.12% పెరిగి 59,487.45 వద్ద, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 84.55 పాయింట్లు లేదా 0.45% పెరిగి 18,979.75 వద్ద ట్రేడవుతున్నాయి.

సెన్సెక్స్ షేర్లలో హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, ఎల్ అండ్ టీ, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎం అండ్ ఎం, ఎటర్నల్, ట్రెంట్ టాప్ లూజర్స్‌గా ఉన్నాయి. హిందుస్తాన్ యూనిలీవర్, బజాజ్ ఫైనాన్స్, మారుతి సుజుకి, ఎన్‌టీపీసీ, పవర్ గ్రిడ్ టాప్ గెయినర్స్‌లో ఉన్నాయి.

జులై 8న విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FIIs) ₹26.12 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (DIIs) ₹1,366.82 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.

ఆసియా మార్కెట్లలో బ్యాంకాక్, హాంకాంగ్ బలహీనంగా ట్రేడవుతుండగా, జపాన్, సియోల్, చైనా, జకార్తా లాభాల్లో ఉన్నాయి. అమెరికాలో, డౌ జోన్స్ 165.60 పాయింట్లు తగ్గి 44,240.76 వద్ద ముగిసింది. ఎస్ అండ్ పీ 500 సూచీ 0.07% తగ్గగా, నాస్డాక్ 0.03% స్వల్ప లాభాన్ని నమోదు చేసింది.

# భారత రిటైల్ సెక్యూరిటైజేషన్ మార్కెట్ Q1 FY26లో 6% వృద్ధి



**టీపీఎన్, న్యూఢిల్లీ :**

కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక ప్రకారం, భారత రిటైల్ సెక్యూరిటైజేషన్ మార్కెట్ 202526 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (Q1 FY26) గత సంవత్సరంతో పోలిస్తే 6% వృద్ధిని సాధించి, మొత్తం ₹45,400 కోట్ల వాల్యూమ్‌ను చేరుకుంది. పెట్టుబడిదారుల విశ్వాసం, బలమైన ఆస్తి నాణ్యత, మరియు వాహన రుణాలు, మైక్రోఫైనాన్స్ రుణాలకు పెరుగుతున్న డిమాండ్ ఈ వృద్ధికి కారణాలుగా ఉన్నాయి.

పాస్‌త్రూ సర్టిఫికేట్ (PTC) జారీలు మరియు డైరెక్ట్ అసైన్‌మెంట్ (DA) లావాదేవీలతో కలిపి, మొత్తం లావాదేవీల వాల్యూమ్ ₹52,000 కోట్లుగా నమోదైంది. ఈ సెక్టార్‌లో నిరంతర వృద్ధి మార్కెట్ స్థిరత్వాన్ని మరియు రుణదాతలు నిధుల సేకరణలో వైవిధ్యాన్ని తీసుకురావడానికి చేస్తున్న వ్యూహాత్మక మార్పులను సూచిస్తుంది.

ఈ త్రైమాసికంలో ఒక ముఖ్యమైన సంఘటన ఏమిటంటే, RMBS డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (RDCL) ద్వారా భారతదేశంలో మొట్టమొదటి రెసిడెన్షియల్ మార్ట్‌గేజ్‌బ్యాక్డ్ సెక్యూరిటైజేషన్ (RMBS) ఒప్పందం జరిగింది. ఇది ఎలక్ట్రానిక్ బుక్ ప్రొవైడర్ (EBP) ప్లాట్‌ఫారమ్‌పై జరిగిన తొలి సెక్యూరిటైజేషన్ కూడా. ఈ నూతన ఆవిష్కరణ మార్ట్‌గేజ్‌బ్యాక్డ్ సెక్యూరిటీలలో పెట్టుబడిదారుల ఆసక్తిని పెంచి, దీర్ఘకాలిక నిధుల సేకరణ అవకాశాలను మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు.

Q1 FY26లో PTC లావాదేవీలు మొత్తం వాల్యూమ్‌లో 56% వాటాను కలిగి ఉన్నాయి, గతంలో డామినేట్ చేసిన DA లావాదేవీలను అధిగమించాయి. ఈ మార్పు పెట్టుబడిదారులు ప్రామాణిక మరియు ట్రేడబుల్ ఫైనాన్షియల్ ఇన్‌స్ట్రుమెంట్‌లపై పెరుగుతున్న ఆసక్తిని సూచిస్తుంది. PTCలలో, ఆస్తిఆధారిత సెక్యూరిటైజేషన్ (ABS) ఉత్పత్తులు 75% వాటాతో ముందంజలో ఉన్నాయి, అందులో వాహన రుణాలు ₹14,600 కోట్లతో లేదా ABS జారీలలో 51% వాటాను కలిగి ఉన్నాయి.

అయితే, వాహన రుణఆధారిత PTCల వాటా తగ్గుతోంది, ఎందుకంటే అసురక్షిత వ్యక్తిగత రుణాలు, వ్యాపార రుణాలు, బంగారు రుణాలు వంటి ఇతర విభాగాలు ఊపందుకుంటున్నాయి. అసురక్షిత రుణాలు PTC వాల్యూమ్‌లో 15% వాటాను కలిగి ఉన్నాయి, ఇది వైవిధ్యమైన రిటైల్ క్రెడిట్ ఉత్పత్తులపై పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతున్నట్లు సూచిస్తుంది.

మైక్రోఫైనాన్స్ సంస్థల (MFIs) PTC వాటా గత సంవత్సరం 8% నుండి 15%కి పెరిగింది, ఇది ఆస్తి నాణ్యతలో మెరుగుదల మరియు ఈ రంగంపై పెట్టుబడిదారుల విశ్వాసం పెరిగినట్లు సూచిస్తుంది. DA సెగ్మెంట్‌లో, మార్ట్‌గేజ్‌ఆధారిత ఒప్పందాలు 67% వాటాను కలిగి ఉండగా, ఆస్తిఆధారిత DAలు 26% వాటాను కలిగి ఉన్నాయి.

### అమెరికాభారత వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో

# స్వల్ప లాభాలు!

**టీపీఎన్, ముంబై :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత దేశంతో వాణిజ్య ఒప్పందం త్వరలో పూర్తవుతుందని ప్రకటించడంతో, భారత ఈక్విటీ మార్కెట్లు మంగళవారం జాగ్రత్తగా ప్రారంభమైన తర్వాత స్వల్ప లాభాలతో ముందుకు సాగాయి. ప్రారంభంలో బలహీనంగా ఉన్న BSE సెన్సెక్స్ 121.55 పాయింట్లు తగ్గి 83,320.95 వద్ద, NSE నిఫ్టీ 37.15 పాయింట్లు తగ్గి 25,424.15 వద్ద ట్రేడయ్యాయి. అయితే, కొద్దిసేపటికే రెండు సూచీలు రికవరీ కనబరిచాయి. ఉదయం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 86.13 పాయింట్లు పెరిగి 83,526.55కి, నిఫ్టీ 19.75 పాయింట్లు పెరిగి 25,481.05కి చేరుకున్నాయి.

దక్షిణ కొరియా యొక్క కోస్పి, జపాన్ యొక్క నిక్కీ 225, చైనా యొక్క SSE కాంపోజిట్, మరియు హాంకాంగ్ యొక్క హాంగ్ సెంగ్ వంటి ఆసియా మార్కెట్లలో లాభాలు మనోభావాలను ఉత్తేజపరిచాయి. అదనంగా, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (FIIs) నుండి కొత్త నిధుల ప్రవాహం మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది.

సెన్సెక్స్ కంపెనీలలో కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎటర్నల్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, మరియు అదానీ పోర్ట్స్ లాభాల్లో ముందున్నాయి. మరోవైపు, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్ ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్, మరియు ట్రెంట్ వెనుకబడ్డాయి.

సోమవారం మాట్లాడిన ట్రంప్, అమెరికా ఇప్పటికే యూకే మరియు చైనాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకున్న తర్వాత, భారత దేశంతో ఒప్పందం సమీపిస్తోందని తెలిపారు. అమెరికా ఆసక్తులకు విరుద్ధంగా ఉన్న దేశాలపై సుంకాలు విధిస్తామని, జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, బంగ్లాదేశ్ సహా 14 దేశాలకు లేఖలు పంపినట్లు ఆయన చెప్పారు.

"ఈ జాబితాలో భారతదేశం లేకపోవడం, ట్రంప్ వ్యాఖ్యలు వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే అవకాశం ఉందని సూచిస్తున్నాయి," అని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయ కుమార్ అన్నారు. అయితే, ఒప్పందంలోని చిన్నపాటి వివరాలు, ముఖ్యంగా రంగనిర్దిష్ట సుంకాలపై మార్కెట్ ప్రతిస్పందన ఆధారపడి ఉంటుందని ఆయన జోడించారు.

సోమవారం FIIలు ₹321.16 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేయగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (DIIs) ₹1,853.39 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. బ్రెంట్ క్రూడ్ ధర స్వల్పంగా తగ్గి బ్యారెల్‌కు $69.33 వద్ద ఉంది.




# దేశంలో ఈవీల విక్రయాల జోరు



**టీపీఎన్, న్యూఢిల్లీ :**

దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తున్నది. గత నెలలో దేశీయంగా 1.80 లక్షల యూనిట్ల ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన వాహనాలతో పోలిస్తే 28.60 శాతం అధికమని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ (ఫాడా) తాజాగా వెల్లడించింది. ఈప్యాసింజర్ వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం ఇందుకు కారణమని తెలిపింది. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన అమ్మకాలు 7,323 యూనిట్ల నుంచి 13,178 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం వాహన విక్రయాల్లో ప్యాసింజర్ వాహనాల వాటా 4.4 శాతానికి ఎగబాకింది. కమర్షియల్ వాహనాలు ఏడాది ప్రాతిపదికన రెండింతలు పెరిగి 1,146 యూనిట్లకు చేరుకున్నాయి. పెట్రోల్ ధరలు గరిష్ఠ స్థాయిలో ఉండటంతో వాహన కొనుగోలుదారులు ఈవీలపై ఆసక్తి చూపుతున్నారని, అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక స్కీంలు కూడా ఆకట్టుకుంటున్నాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. చార్జింగ్ స్టేషన్లు అత్యధికంగా ఏర్పాటు కావడంతో చార్జింగ్ ఇబ్బందులు కూడా లేకుండా పోయాయన్నారు.


# దిగొస్తున్న బంగారం ధరలు



**టీపీఎన్, ముంబై :**

పసిడి ప్రియులకు గుడ్ న్యూస్. బంగారం ధరలు దిగివస్తున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడంతో ధర దిగి వచ్చింది. బుధవారం రాజధాని ఢిల్లీలో బంగారం 24 క్యారెట్ల ధర రూ.700 తగ్గి తులానికి రూ.98,420కి చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.600 తగ్గి తులానికి రూ.98వేలకు తగ్గింది. అదే సమయంలో వెండి ధర కిలోగ్రాముకు రూ.800 తగ్గి రూ.1,04,000కి చేరుకుంది. ఈ మేరకు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. జులైలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గింపు అంచనాలు తగ్గడం, యూఎస్ డాలర్ బలోపేతం కావడంతో బంగారం ధరలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ (కమోడిటీస్) సౌమిల్ గాంధీ తెలిపారు.

# భారత్‌లో గూగుల్ ఏఐ మోడ్




1టీపీఎన్ ప్రతినిధి :

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఏ సమాచారం కావాలన్నా గూగుల్ సెర్చ్ ఓపెన్ చేస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది దీన్ని ఉపయోగిస్తారు. యూజర్లు అడిగిన సమాచారాన్ని.. సంబంధిత వెబ్‌లింక్‌లను వెతికి ఇస్తుంది. అయితే, చాట్‌జీపీటీ రాకతో గూగుల్ కూడా 'ఏఐ' వైపు అడుగులు వేసింది. తన సెర్చ్ ఇంజిన్‌కు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను అనుసంధానం చేసింది. ఇప్పటికే అమెరికాలో విడుదలై విజయవంతంగా సేవలు అందిస్తున్న 'గూగుల్ సెర్చ్ ఏఐ మోడ్ ఇప్పుడు భారత్ లోనూ అందుబాటులోకి వచ్చింది. ఎలాంటి సైన్‌అప్స్ చేయకుండానే డైరెక్ట్‌గా మొబైల్, వెబ్ వెర్షన్లలో ఏఐ ఆధారిత శోధనలు చేసుకోవచ్చు. ఇప్పటివరకు గూగుల్‌లో ఏదైనా వెతికితే.. అందుకు సంబంధించిన వెబ్‌లింక్‌లు మాత్రమే వచ్చేవి. కొన్ని సంక్లిష్టమైన ప్రశ్నలకు జవాబులు దొరికేవి కాదు. కానీ, ఈ సరికొత్త ఏఐ మోడ్ టూల్‌తో.. ఎలాంటి ప్రశ్నకైనా ఇట్టే సమాధానం దొరుకుతుంది. వినియోగదారుల మనసులో ఏమున్నా.. గూగుల్‌ను నేరుగా అడగొచ్చు. వాటికి గూగుల్ ఏఐ టూల్ 'జెమిని' సహాయంతో సమాధానాన్ని అందిస్తుంది. అందుకే, ఈ గూగుల్ సెర్చ్ ఏఐ మోడ్‌ను 'జెమిని 2.5 వెర్షన్‌గా చెబుతున్నారు. ప్రస్తుతానికి ఇంగ్లీషులో మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలోనే తెలుగుతోపాటు ఇతర ప్రాంతీయ భాషల్లోనూ సేవలు అందించనున్నది.



# గల్లీ టూ ర్యాపర్.. మహి ఘూనే స్టోరీ..





ఆమె ఓ ర్యాపర్.. కానీ అంత ఈజీగా తన లైఫ్ లో సక్సెస్ అవ్వలేదు. ఎన్నో చాలెంజెస్ ను క్రాస్ చేసి ఈ స్టేజ్ కి చేరింది. ఆమె పేరు మహి మధుర ఘూనే. మహదేవ్ కొలి అనే తెగకు చెందిన మహిది మహారాష్ట్రలోని కలన్ అనే ప్రాంతం. ఇక్కడ స్కూల్ లో చదువుకునే వారి కంటే మధ్యలో మానేసే వారే ఎక్కువ. అమ్మాయిలకు చిన్నవయసులోనే పెళ్లి చేయడం ఇక్కడ చాలా నార్మల్. అయితే మహి తండ్రి బస్ కండక్టర్ కావడంతో తన ఇద్దరు పిల్లల్ని చదువుకోమని ఎంకరేజ్ చేశారట. ఈ క్రమంలోనే రకరకాల సామాజిక అడ్డంకుల్ని దాటుకుని ఆమె ఇంజినీరింగ్ పూర్తి చేసింది. మహికి కాలేజీ రోజుల నుంచే కవితలు రాసే అలవాటుంది. ఆ తర్వాత కూడా ఈ అలవాటునే కంటిన్యూ చేస్తుంది. ఓవైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే మరోవైపు ఖాళీ సమయాల్లో కవితలు రాసేదట. ఈ క్రమంలోనే 2019లో వచ్చిన గల్లీబాయ్ సినిమా ఆమె జీవితాన్నే మార్చేసింది. ఈ సినిమాను ఓ ర్యాపర్ జీవితం ఆధారంగా తెరకెక్కించారు. ఆ తర్వాత ర్యాప్ మ్యూజిక్ కి ఆదరణ మరింత పెరిగింది. దాంతో తాను కూడా దేశంలోని రకరకాల సోషల్ ప్రాబ్లెమ్స్ ను ర్యాప్ సాంగ్స్ తో వెలుగులోకి తీసుకురావచ్చని అనుకుంది మహి. అప్పటికే తాను కవితలు రాస్తుండడంతో తన ఆలోచనలను ర్యాప్ వైపు టర్న్ అయ్యింది. ర్యాప్ పాటలతో యూత్ కు సోషల్ టాపిక్స్ గురించి సూటిగా చెప్పాలనుకున్న మహి.. 2020 ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమాన్ని వేదికగా చేసుకుంది. ఈ క్రమంలో రైతుల సమస్యల గురించి ఓ ర్యాప్ సాంగ్‌ని ప్లాన్ చేసుకుని తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఆ వీడియోకి అభిమానుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో తాను సెలెక్ట్ చేసుకున్న మార్గం సరైందని భావించింది. దాంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి పూర్తి ర్యాపర్‌గా మారిపోయింది. అలా 2021లో మరాఠీ ర్యాపర్ ర్యాప్‌బాస్ తో కలిసి తన ఫస్ట్ ట్రాక్ Jungle cha Raja ను రిలీజ్ చేసింది. ఇందులో ఆదివాసీల సమస్యలను వివరించడంతో.. వారి నుంచి చక్కటి ఆదరణ సొంతం చేసుకుంది. ఆ తర్వాత ట్రాన్స్‌జెండర్ సమస్యలపై తన స్టైల్ లో ర్యాప్ ను ప్లే చేసింది. అంతేకాకుండా వారి కోసమే ఏర్పాటు చేసిన హమ్ సఫర్ ట్రస్ట్ తో కలిసి పనిచేసింది. అంబేద్కర్ 131వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పిస్తూ Baapmanus అనే పాటను పాడింది. ఇదే ర్యాప్‌ను న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలోనూ పాడి అక్కడి ఆడియన్స్ ని ఆకట్టుకుంది. ఏ టాపిక్ అయినా సరే నా మనసుకు తాకితే వెంటనే ర్యాప్ రాస్తాను. అయితే నా గురించి పాటల రూపంలో ప్రపంచానికి తెలియజేయడం మాత్రం నాకు ఇష్టం లేదు. వేరే ఆర్టిస్ట్ ల పాటలు కూడా అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా ఉండాలని కోరుకుంటాను అంటుంది మహి. మహికి కవితలు, పాటలు రాసే అలవాటు తన తండ్రి నుంచి వచ్చిందట. అంతేకాదు.. ఒకవేళ పాటల్లో ఏవైనా లోపాలుంటే ఆయన సరైన సూచనలిస్తారని కూడా చెబుతోంది. ప్రజంట్ సోషల్ మీడియా విస్తృతంగా పెరగడంతో తన పాట నలుమూలల్లోనూ వినిపిస్తుందని మహి సంతోషం వ్యక్తం చేస్తుంది.

## ఫోన్ బ్యాటరీ విషయంలో ఇన్ని అపోహలా?

స్మార్ట్‌ఫోన్లు.. ఇవి లేకపోతే ప్రజంట్ సిట్యూవేషన్ లో హ్యూమన్ లైఫ్ లేదు అనడంలో ఎలాంటి డౌట్ లేదు. మన జీవితంలో ఒక భాగంగా మారిపోయాయి. బ్యాంకు, ఈమెయిల్, సామాజిక మాధ్యమాల పనులన్నీ ఇప్పుడు దీంతోనే సాగుతున్నాయి. అందుకే ఎక్కడ బ్యాటరీ నిండుకుంటుందోనని తరచూ ఫోన్ల వంక చూస్తూనే ఉంటాం. ఇంటర్నెట్ లో బ్యాటరీని సేవ్ చేసుకోవటానికి సంబంధించిన టిప్స్ కు కొదవలేదు. అయితే వీటిల్లో చాలావరకూ ఎక్స్ పైర్ అయినవే. అవి కొత్త ఫోన్లకు వర్తించవు. మరి కొన్ని బ్యాటరీ అపోహల్లో నిజాలేంటో చూద్దాం. అతి ఎక్కువగా ప్రచారంలో ఉన్న అపోహల్లో ఒకటి. బ్యాక్ గ్రౌండ్ యాప్స్ ను రిమూవ్ చేస్తే బ్యాటరీ సేవ్ అవుతుందని అనుకోవటం. ఫోన్ లో ఎన్ని ఎక్కువ యాప్ లు ఓపెన్ అయ్యుంటే అంత ఎక్కువగా బ్యాటరీ ఖర్చవుతుందని చాలామంది నమ్ముతుంటారు. ఇది పాత ఫోన్ల విషయంలో నిజం కావొచ్చేమో గానీ కొత్త ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాలకు మాత్రం కాదు. లేటెస్ట్ టెక్నాలజీ ఫోన్లన్నీ బ్యాక్ గ్రౌండ్ లో ఉన్న యాప్స్ ను పాజ్ చేసేస్తాయి. ఆశ్చర్యంగా అనిపించినా ఓపెన్ చేసి ఉన్న యాప్స్ ను ప్రతిసారి తీసేస్తుంటే.. ఫోన్ మరింత ఎక్కువ బ్యాటరీని వాడుకుంటుంది. ఎందుకంటే బ్యాక్ గ్రౌండ్ నుంచి రిమూవ్ చేసినప్పుడు అవి మెమరీ నుంచి పోతాయి. తిరిగి ఓపెన్ చేసినప్పుడు స్టోరేజీ నుంచి రీలాంఛ్ అవుతాయి. ఇందుకు బ్యాటరీని వాడుకుంటాయి. యాప్స్ రెస్పాన్స్ కానప్పుడు.. వాటితో పనిలేనప్పుడే యాప్స్‌ను బ్యాక్ గ్రౌండ్ నుంచి తీసేయడం మంచిది. ఫోన్ ను ఎక్కువగా ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ మీద ఎక్కువగా ఎఫెక్ట్ పడుతుందనేది మరో అపోహ. దీనికి మూలం పాతకాలం ఫోన్లు. లిథియం అయాన్ బ్యాటరీలు రాక ముందు ఎక్కువసేపు ఛార్జ్ చేస్తే పరికరాలు వేడెక్కేవి. ఫలితంగా బ్యాటరీ క్వాలిటీ టైమ్ తగ్గేది. అయితే మోడరేట్ ఫోన్లలో ఓవర్‌ఛార్జింగ్ చేసినా దెబ్బతినకుండా కాపాడే టెక్నికల్ పార్ట్స్ ఉంటున్నాయి. బ్యాటరీ పూర్తిస్థాయి ఛార్జింగ్ కు వస్తున్నప్పుడు ఫోన్ దాన్ని ట్రికిల్ ఛార్జింగ్‌కు మారుస్తుంది. అప్పుడు బ్యాటరీ నెమ్మదిగా... డిశ్చార్జ్ అయ్యే పర్సంటేజ్ తో ఈక్వల్ గా లేదా దాని కన్నా కాస్త ఎక్కువగా ఛార్జ్ అవుతుంది. అంటే 100% ఛార్జింగ్ దగ్గరికి వస్తున్నప్పుడు ఫోన్ చాలా నెమ్మదిగా ఛార్జ్ అవుతుందన్నమాట. ఫోన్‌లో వైఫై, బ్లూటూత్ ఆన్ చేసి ఉంచితే బ్యాటరీ త్వరగా నిండుకుంటుందనేది ఇంకో అపోహ. ఇది పదేళ్ల క్రితం నాటి మాట. అధునాతన టెక్నాలజీ.. మెరుగైన ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాల రాకతో నేడు అలాంటి ఇబ్బంది తొలగిపోయింది. వైఫై, బ్లూటూత్‌ను డిసేబుల్ చేస్తే కొద్దిగా బ్యాటరీ ఆదా కావొచ్చు గానీ పెద్ద తేడా కనిపించదు. దగ్గర్లో ఛార్జర్ ఉంటే లేదా రాత్రిపూట ఛార్జ్ చేసే అవకాశం ఉంటే ఈ ఫీచర్లను ఆన్ చేసుకుంటే ఇబ్బందేమీ ఉండదు. బ్యాటరీ పూర్తిగా నిండుకున్న తర్వాతే ఛార్జింగ్ చేయాలనుకోవటం శుద్ధ తప్పు. నిజానికి వీలైనంత వరకూ ఛార్జింగ్ సున్నాకు చేరకుండా చూసుకోవటమే ఉత్తమం. ఎందుకంటే సున్నా నుంచి ఛార్జ్ కావటానికి ఎక్కువ శక్తి అవసరమవుతుంది. నికెల్‌కాడ్మియం ఆధారిత పాత బ్యాటరీ టెక్నాలజీలు సున్నాకు చేరకపోతే తమ పూర్తి సామర్థ్యాన్ని గుర్తించేవి కావు. అందుకే అప్పట్లో పూర్తిగా బ్యాటరీ నిండుకున్నాకే ఛార్జ్ చేస్తుండేవారు. ఇప్పుడలా కాదు. లిథియం అయాన్ బ్యాటరీలకు అలాంటి సమస్యేమీ లేదు. ఛార్జింగ్ 20 శాతం కన్నా దిగువకు పడిపోకుండా చూసుకోవటం మంచిదన్నది నిపుణుల సూచన. బ్యాటరీ ఛార్జింగ్ 20 కన్నా తగ్గితే బ్యాటరీ సేవింగ్ మోడ్‌లోకి మార్చుకోవాలని కొన్ని ఫోన్లు సూచిస్తుండటం గమనించే ఉంటారు. చాలా ఏళ్ల పాటు అతిగా వాడినప్పటికీ అధునాతన ఫోన్లు కనీసం 80% బ్యాటరీ సామర్థ్యాన్ని నిలిపి ఉంచుకుంటాయి కూడా. మనం చాలావరకూ ఫోన్ కొన్నప్పుడు దాని వెంట వచ్చే ఛార్జర్‌నే వాడతాం. ఎందుకంటే థర్డ్ పార్టీ లేదా అనధికార ఛార్జర్లు వాడితే బ్యాటరీ దెబ్బతినే అవకాశముందని ఫోన్‌ను తయారుచేసిన కంపెనీలు చెబుతుంటాయి. అందుకే థర్డ్ పార్టీ ఛార్జర్లు వాడితే బ్యాటరీ క్షీణిస్తుందనే నమ్మకం ప్రబలిపోయింది. కొన్ని స్మార్ట్‌ఫోన్లు సొంత ఛార్జింగ్ ప్రమాణాలతో వచ్చినప్పటికీ చాలా ఫోన్లు యూఎస్‌బీ పవర్ డెలివరీ పీపీఎస్ వంటి ప్రమాణాలనూ సపోర్టు చేస్తాయి. అంటే కంపెనీకి సంబంధించిన ఛార్జర్ అవసరం లేదన్నమాట. కాకపోతే నాణ్యమైన, విశ్వసనీయమైన బ్రాండ్ల ఛార్జర్లు మాత్రమే కొనాలి. నాసిరకం ఛార్జర్లతో బ్యాటరీతో పాటు ఫోన్ దెబ్బతినే ప్రమాదముంది.



## పిల్లలు ఒత్తిడికి లోనవుతున్నారా?

రోజూ బడికి వెళ్లే పిల్లలు హోంవర్క్, పరీక్షలు, ట్యూషన్లు అంటూ చదువులోనే పూర్తిగా నిమగ్నమై ఉంటున్నారు. సెలవు రోజుల్లో కూడా స్మార్ట్ ఫోన్ చూస్తూ అందులోనే ఆటలు ఆడుతూ సమయం గడిపేస్తూ ఉంటారు. దీనివల్ల తెలియకుండానే పిల్లల్లో ఒత్తిడి స్టార్ట్ అవుతుంది. అలా కాకుండా రోజూ సాయంత్రం పిల్లల చేత ఆటలు ఆడించాలి. ఆటల్లో భాగంగా పరుగెత్తడం, నవ్వడం, అరవడం వల్ల పిల్లల శరీరంలో ఎండార్ఫిన్లు రిలీజ్ అవుతాయి. ఇవి ఒత్తిడిని దూరంచేసి సంతోషాన్ని కలిగిస్తాయి. సైకిల్ తొక్కడం, తేలికపాటి వ్యాయామాలు చేయడం లాంటి వాటిని పిల్లలకు అలవాటు చేయాలి. సొంత పనుల్లో మునిగిపోయి పట్టించుకోకపోతే పిల్లల్లో ఒంటరితనం అనే భావన మొదలవుతుంది. ఇది క్రమంగా ఒత్తిడికి దారితీస్తుంది. కాబట్టి పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. వాళ్లతో స్నేహపూర్వకంగా మెలగాలి. స్కూల్ లో ఏం జరిగిందనే విషయాల గురించి అడిగి తెలుసుకోవాలి. వీలైనంత ఎక్కువ సమయాన్ని పిల్లలతో గడపాలి. పిల్లలకు రోజూ పోషకాహారం పెట్టాలి. అందులో పాలు, నెయ్యి, తాజా పండ్లు, గింజలు, ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూడాలి. వీటివల్ల శరీరంలో సెరటోనిన్ ఉత్పత్తి పెరిగి ఒత్తిడి దరిచేరదు. అప్పుడప్పుడూ డార్క్ చాక్లెట్ తెచ్చి ఇస్తుంటే పిల్లల సంతోషానికి అవధులు ఉండవు. పిల్లలపై కోపాన్ని చూపించకూడదు. అలాగని అతిగా గారాబం చేయకూడదు. ప్రతి విషయాన్ని వాళ్లకు అర్థమయ్యే రీతిలో ఓపికగా వివరించి చెప్పాలి. సందర్భానుసారం చక్కగా ప్రవర్తించినప్పుడు పిల్లలను మనస్ఫూర్తిగా ప్రశంసించాలి. దీనివల్ల వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చిన్నపాటి పొగడ్తల వల్ల మెదడులో డోపమైన్ స్థాయి పెరుగుతుంది. దీంతో పిల్లల మనసు ప్రశాంతంగా మారుతుంది. ఆటలు, సంగీతం, పాటలు పాడడం, నృత్యం చేయడం, చిన్న కథలు రాయడం లేదా చెప్పడం, బొమ్మలు వేయడం ఇలా ఆసక్తి ఉన్న అంశాన్ని నేర్చుకునేలా పిల్లలను ప్రోత్సహించాలి. దీనివల్ల పిల్లలకు మానసిక ఆనందం కలుగుతుంది. దీనివల్ల వారికి ఒత్తిడి అనిపించదు. పైగా వాళ్లల్లో ఉండే స్మార్ట్ వర్క్ తో పాటు వారి టాలెంట్ ను కూడా తెలుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది.

## వాకింగ్ వల్ల ఎన్ని లాభాలో తెలుసా?

వాకింగ్ అనేది చాలా నార్మల్ అండ్ సేఫ్ వ్యాయామం. ప్రతిరోజూ నడవడం చాలా మంచిది. ఇది శరీరానికి చాలా రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది సులభమైన, తక్కువ ప్రభావం చూపే వ్యాయామం. రక్త ప్రసరణ నుండి గుండె ఆరోగ్యం వరకు ఎంతగానో హెల్ప్ చేస్తుంది. ప్రతిరోజూ నడవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని యోగా నిపుణులు చెబుతున్నారు. అయితే, వాకింగ్ వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు చూద్దాం. వాకింగ్ చేయడం వల్ల కేలరీలు బర్న్ అవుతాయి. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి వాటి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఇది రక్తపోటును కంట్రోల్ చేయడంలో హెల్ప్ చేస్తుంది. అంతేకాకుండా ఒత్తిడిని తగ్గించడం, డిప్రెషన్‌ను తగ్గించడం, మానసిక స్థితిని మెరుగుపరచడంలో వాకింగ్ ఎంతగానో సహాయపడుతుంది. వాకింగ్ శారీరక దృఢత్వాన్ని మెరుగుపరుస్తుంది. కండరాలను బలోపేతం చేస్తుంది. ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ప్రతిరోజూ వాకింగ్ చేయడం వల్ల మరింత ఫిట్‌గా కూడా ఉంటారు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పార్కులో వాకింగ్ కు వెళ్లడం మంచిది. వాకింగ్ చేసేటప్పుడు హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. సౌకర్యవంతమైన బూట్లు ధరించండి. లేదంటే వాకింగ్‌కు వెళ్లినప్పుడు పాదాలకు గాయాలు అయ్యే అవకాశం ఉంది. నడకతో పాటు, ఇతర వ్యాయామాలను కూడా చేయండి. వీటితో పాటు డైలీ హెల్తీ డైట్ ను మెయింటైన్ చేయడం వల్ల కూడా శరీరం ఫిట్ గా ఉంటుంది.





## క్యాన్సర్‌ను కనిపెట్టండిలా

మనం శ్రద్ధ పెట్టి వింటే శరీరం మనతో మాట్లాడుతుంది. డబ్బులు సంపాదించాలి.. జీవితంలో ఉన్నతంగా ఎదగాలి అనే తపనతో శరీరంపై అలసత్వం చూపించకండి. జబ్బులను ముందే గుర్తిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు. క్యాన్సర్ విషయంలో ఇది మరింత ముఖ్యం. అలాంటి నిర్లక్ష్యం చేయకూడని కొన్ని క్యాన్సర్ లక్షణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఆహార, వ్యాయామ నియమాలేవీ పాటించకుండా.. అకారణంగా బరువు తగ్గుతుంటే క్లోమ, జీర్ణాశయ, పెద్దపేగు, అన్నవాహిక క్యాన్సర్ కారణం కావొచ్చు. అలసట వేధిస్తుంటే.. విశ్రాంతి తీసుకున్న తర్వాతా నిస్సత్తువ వీడకపోతే రక్త, ఎముకమజ్జ క్యాన్సర్లని అనుమానించాల్సిందే. ఇలాంటి క్యాన్సర్లు ఒంట్లో శక్తిని త్వరగా హరించేస్తుంటాయి. కారణమేదీ తెలియకుండా తరచూ జ్వరం వస్తున్నట్టయితే బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రోగనిరోధక వ్యవస్థను బలహీనం చేసే ఇతర త్రా క్యాన్సర్లకు సింబాలిక్ కావొచ్చు. మూడు నెలలు దాటినా దగ్గు తగ్గకపోవటం, కళ్లెలో రక్తం పడటం, గొంతు బొంగురు పోవటం వంటివి ఊపిరితిత్తి, గొంతు లేదా తల, మెడ క్యాన్సర్లలో కనిపిస్తుంటాయి. కొద్దిపాటి పనికే ఆయాసం, ఛాతీ బిగపట్టినట్టు అనిపించటం ఊపిరితిత్తి క్యాన్సర్, ఊపిరితిత్తి ధమనుల్లో అడ్డంకి, ఇతర అవయవాల క్యాన్సర్ ఊపిరితిత్తి చేరుకోవటానికి హెచ్చరిక అయ్యిండొచ్చు. హఠాత్తుగా చూపు మసకబారటం, ఒకటికి రెండు కనిపించటం, కళ్ల ముందు మిరుమిట్లు గొలపటం వంటివి మెదడు, కళ్ల క్యాన్సర్ల లక్షణాలు కావొచ్చు. వీటికి మధుమేహమూ యాడ్ అవుతుంది. షుగర్ క్లోమ క్యాన్సర్ ఎక్కువ అవుతుంది. దీర్ఘకాలంగా అజీర్ణం, ఛాతీలో మంట, ముద్ద సరిగా కిందికి దిగకపోవటం, కడుపుబ్బరం వంటివి అన్నవాహిక, జీర్ణాశయం, క్లోమ క్యాన్సర్లలో ముదిరిపోతాయి. హఠాత్తుగా, అకారణంగా ఆకలి తగ్గటం కూడా హెచ్చరిక సంకేతమే. యూరిన్ లో రక్తం పడటం పెద్దపేగు, మూత్రపిండాలు, మూత్రాశయ క్యాన్సర్లలో కనిపిస్తుంది. హఠాత్తుగా, అతి తీవ్రంగా జీవితంలో ముందెన్నడూ ఎరుగని విధంగా తలనొప్పి వేధిస్తుంటే.. ముఖ్యంగా వికారం, వాంతి, తల తేలిపోవటం లేదా నాడీ సంబంధ లక్షణాలూ కనిపిస్తుంటే మెదడు కణితి కారణం కావొచ్చు. ఇతర చోట్ల నుంచి క్యాన్సర్ మెదడులోకి వ్యాపించినా ఇలాగే ఉండొచ్చు. ముఖం, చేతులు, కాళ్లు హఠాత్తుగా మొద్దుబారినట్టు అనిపించినా దీన్ని అనుమానించాలి. దీర్ఘకాల లేదా అకారణ నొప్పులనూ విస్మరించొద్దు. ముఖ్యంగా ఎముకలు, కీళ్లలో నొప్పి వస్తుంటే తాత్సారం చేయొద్దు. ఇతర భాగాల నుంచి ఎముకల వంటి అవయవాలకు విస్తరించే క్యాన్సర్లలో ఇలాంటి నొప్పులు కనిపిస్తుంటాయి. కొత్త పుట్టుమచ్చలు రావటం లేదా అప్పటికే ఉన్నవి రంగు, సైజు, ఆకారం మారటం.. పుండ్లు మానకపోవటం మెలనోమా వంటి చర్మక్యాన్సర్లకు సంకేతాలు కావొచ్చు. వ్యాధిని ముందే గుర్తించడం వల్ల మీతో పాటు మీ కుటుంబాన్ని సంరక్షించుకున్నవారు అవుతారు. కాబట్టి జాగ్రత్త వహించండి.

# రణరంగం.. నేడే ఇంగ్లండ్ తో మూడో టెస్ట్









ఇంగ్లండ్ తో జరుగుతున్న ఐదు టెస్టు మ్యాచ్ల సిరీస్‌లో మూడో టెస్టుకు టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా రెడీ అయ్యారు. ఈ నెల 10 నుంచి లార్డ్స్ వేదికగా మూడో టెస్టు స్టార్ట్ కానుంది. ఈ మ్యాచ్‌లో బుమ్రా తిరిగి బరిలోకి దిగనున్నాడు. వర్క్‌లోడ్ కారణంగా బుమ్రా బర్మింగ్‌హామ్ టెస్టు మ్యాచ్‌కు దూరమయ్యాడు. మ్యాచ్ తరువాత బుమ్రా మూడో టెస్టుకు అందుబాటులో ఉంటాడని రెండో టెస్ట్ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ క్లియర్ చేశాడు. ఈ మ్యాచ్ కోసం బుమ్రా నెట్స్‌లో బాగానే కష్టపడ్డాడు. సుమారు 45 నిమిషాల పాటు బౌలింగ్ చేశాడు. అలాగే లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్, త్రోడౌన్ స్పెషలిస్ట్‌తో బ్యాటింగ్ సైతం ప్రాక్టీస్ చేశాడు. సిరీస్ మొదలయ్యే ముందు ఇంగ్లండ్ టూర్‌లో బుమ్రా కేవలం మూడు టెస్టులకు మాత్రమే ఆడుతానని చెప్పిన విషయం తెలిసిందే. లీడ్స్ టెస్ట్‌లో బుమ్రా ఆడగా.. రెండో టెస్టుకు రెస్ట్ తీసుకున్నాడు. ప్రస్తుతం ఈ సిరీస్‌లో 1-1తో రెండు టీమ్స్ ఈక్వల్ గా ఉన్నాయి. ఇక టీమిండియా థర్డ్ టెస్ట్‌కు భారీగానే కసరత్తు చేసింది. ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. బుమ్రా ఎంతో ఉత్సాహంగా కనిపించగా.. కో ప్లేయర్స్ తో చర్చలు కూడా జరిపాడు. ఇదిలా ఉండగా లార్డ్స్ టెస్ట్‌లో బుమ్రాను ప్రసిద్ కృష్ణ స్థానంలో జట్టులోకి రానున్నాడు. మరో వైపు అర్షదీప్ సింగ్ సైతం బాగానే ప్రాక్టీస్ చేశాడు. ఇక లార్డ్స్ పిచ్ బర్మింగ్‌హామ్ కంటే మరింత సవాల్‌గా నిలుస్తుందని క్రికెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇద్దరు స్పిన్నర్లు, ముగ్గురు పేసర్లు, నాలుగో ఫాస్ట్ బౌలర్‌గా నితీష్‌కుమార్‌రెడ్డితో బరిలోకి దిగుతుందా? అనే ఇంట్రెస్టింగ్ గా మారింది. మూడో టెస్టుకు ముందు కెప్టెన్ గిల్, కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, ఆకాశ్ దీప్, మహ్మద్ సిరాజ్ ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గోలేదు. సిరాజ్ ఫస్ట్ రెండు మ్యాచ్‌లలో ఆడగా.. భారత బౌలర్లలో ఎక్కువ ఓవర్లు వేసింది అతనే కావడం విశేషం. బౌలింగ్ కోచ్ పరవూరు ఆనందన్ మాట్లాడుతూ బుమ్రాతోపాటు సిరాజ్ వర్క్‌లోడ్‌ను సైతం మేనేజ్ చేయాల్సి ఉందన్నారు.



## క్రికెట్ కెరీర్ పై కోహ్లీ ఎమోషనల్ కామెంట్స్..


టీమిండియా టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కెరీర్ లో ఎన్నో అరుదైన ఘనతలు అందుకున్నాడు. ఓల్డ్ రికార్డులకు చెక్ పెడుతూనే.. లెక్కనేనన్ని కొత్త రికార్డులు సృష్టించాడు. ప్రతి ఫార్మాట్‌లో టాప్ బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. దాదాపుగా అన్ని ట్రోఫీలు అందుకున్నాడు. ఇలా కెరీర్‌ను తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. టీ20లు, టెస్టులకు రిటైర్‌మెంట్ ఇచ్చేసిన విరాట్.. ఇక మీదట వన్డేల్లో మాత్రమే కనిపించనున్నాడు. తాజాగా టెస్ట్ రిటైర్‌మెంట్‌పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసిన స్టార్ బ్యాటర్.. తన కెరీర్ ఎలా టర్న్ తీసుకుందో కూడా బయటపెట్టాడు. టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి తన కెరీర్‌ను మార్చేశాడని అన్నాడు కోహ్లీ. రవిశాస్త్రితో పని చేయకపోయి ఉంటే టెస్ట్ క్రికెట్‌లో ఇదంతా సాధ్యమయ్యేది కాదు. మేం కలసి విజయాలు సాధించడానికి మాకు ఉన్న క్లారిటీ కారణమని చెప్పాలి. ఏ ప్లేయర్ కి అయినా కెరీర్‌లో ఎదిగే సమయంలో సపోర్ట్ చాలా అవసరం. అలాంటి సపోర్ట్ నాకు రవిశాస్త్రి అందించాడు. ప్రెస్ కాన్ఫరెన్స్‌ల్లో తాను ముందుండి విమర్శలు ఎదుర్కొనేవాడు. ఆయన లేకపోతే నా కెరీర్ ఇలా ఉండేది కాదు. నా క్రికెట్ ప్రయాణంలో ఎల్లప్పుడూ అండగా ఉంటూ కీ రోల్ ను పోషించినందుకు ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటా. ఆయన మీద గౌరవం ఎప్పటికీ తగ్గదు అని చెబుతూ కోహ్లీ ఎమోషనల్ అయ్యాడు. టీమిండియాకు వచ్చిన కొత్తలో తనకు భయం, బెరుకు ఉండేవని.. అయితే యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, జహీర్ ఖాన్ తనకు అండగా నిలిచారన్నాడు కోహ్లీ. డ్రెస్సింగ్ రూమ్ వాతావరణానికి అలవాటు పడేలా చేశారని.. ఎప్పుడూ సపోర్ట్‌గా ఉంటూ వచ్చారని తెలిపాడు. వాళ్ల మద్దతుతోనే జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకోగలిగానని పేర్కొన్నాడు విరాట్.



## హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అరెస్ట్..

సన్ రైజర్స్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హెసీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు అరెస్ట్ అయ్యారు. జగన్మోహన్ రావుతోపాటు హెచ్‌సీఏ సభ్యులను సీఐడీ అరెస్ట్ చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఐపీఎల్ టికెట్ల వ్యవహారంలో విజిలెన్స్ సిఫార్సు మేరకు సీఐడీ ఈ చర్యలకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఐతే గత ఐపీఎల్ సీజన్‌లో హెచ్‌సీఏఎస్ఆర్‌హెచ్ మధ్య టికెట్ల వివాదం జరిగిన సంగతి తెలిసిందే. హెచ్‌సీఏ ప్రెసిడెంట్ హోదాలో ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజీని జగన్‌మోహన్‌రావు బెదిరించారన్నది ఇందులో ముఖ్య ఆరోపణ. అయితే ఆ అభియోగాలన్నీ నిజాలేనని విజిలెన్స్ కన్ఫర్మ్ చేయడంతో సీఐడీ ఇప్పుడు అరెస్టులు చేసింది. హెచ్‌సీఏకు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం 10 శాతం టికెట్లు ఉచితంగా ఇస్తోంది. అయితే మరో 20 శాతం టికెట్లు ఫ్రీగా ఇవ్వాలని, లేకుంటే మ్యాచ్‌లు జరగబోనివ్వమని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. అయితే హెచ్‌సీఏ ద్వారా రిక్వెస్ట్ పెట్టుకుంటే ఆలోచన చేస్తామని ఆ సమయంలో హెచ్ఆర్ఎస్ ఆయనకు స్పష్టం చేసింది. ఈ క్రమంలో తనకు వ్యక్తిగతంగా 10 శాతం వీఐపీ టికెట్లు కచ్చితంగా ఇవ్వాలని, లేకుంటే మ్యాచ్‌లు జరగనివ్వబోమని ఆయన బెదిరింపులకు దిగారు. అందుకు ఎస్ఆర్‌హెచ్ అంగీకరించలేదు. దీంతో లక్నో మ్యాచ్ సందర్భంగా వీఐపీ కార్పొరేట్ బాక్స్‌కు ఆయన తాళాలు కూడా వేయించారు. ఈ పరిణామంతో షాక్ తిన్న ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం.. హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామంటూ ప్రకటించడం చర్చకు దారి తీసింది. ఐపీఎల్ టికెట్ల వివాదం నేపథ్యంతో ఈ ఘటనపై విజిలెన్స్ ఎంక్వయిరీకి తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఈ వ్యవహారంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా హెచ్‌సీఏ అక్రమాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన సీఐడీ.. ఇప్పుడు అరెస్టులు చేసింది.

# క్రికెట్ తారలు ఒక్కటైన వేళ



లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్ తో మూడో టెస్టు మ్యాచ్ ఆడేందుకు టీమ్ ఇండియా రెడీ అయింది. ఇప్పటికే అక్కడికి చేరుకున్న ఇండియా ప్లేయర్స్ ప్రాక్టీస్ కూడా మొదలెట్టేశారు. ఈ క్రమంలో క్రికెట్ సెలబ్రిటీస్ కలిసి ఓ ఫొటోషూట్ లో పాల్గొన్నారు. ఆ ఫొటో బీసీసీఐ తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ యూ వుయ్కెన్ ఛారిటీ కోసం వీళ్లంతా ఒక్క చోటుకు చేరారు. ఇందులో సచిన్, కెవిన్ పీటర్సన్, అజిత్ అగార్కర్, బ్రియాన్ లారా లాంటి సెలెబ్రిటీలు హాజరయ్యారు. యువరాజ్ ఛారిటీ నిధుల కోసం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి, డారెన్ గాఫ్, క్రిస్ గేల్ పాల్గొన్నారు. టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ అయ్యాక తొలిసారి క్రికెట్ స్టార్లతో కలిసి విరాట్ పాల్గొనడం ఇదే ఫస్ట్ టైమ్. ఈసందర్భంగా కోహ్లీ తన టెస్టు కెరీర్ను ముగించాల్సిన సమయం వచ్చిందని చెప్పేందుకు గడ్డం రంగును ఎగ్జంపుల్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. నేను రెండు రోజుల కిందట నా గడ్డానికి రంగు వేసుకున్నా.. ప్రతి నాలుగు రోజులకొకసారి మన గడ్డం రంగు మార్చుకోవాలా? వద్దా? అనేది తెలుస్తుంది అని తన కెరీర్ గురించి ఓ క్లారిటీ ఉందని కోహ్లీ కామెంట్ చేశారు. ప్రజంట్ సోషల్ మీడియాలో కోహ్లీ చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

## గిల్‌కు గంగూలీ స్ట్రాంగ్ వార్నింగ్?

టీమిండియా నయా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మరో ఛాలెంజ్ కు రెడీ అవుతున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ రిజల్ట్ నే లార్డ్స్‌లోనూ రిపీట్ చేయాలని చూస్తున్నాడు. ఈ టైం లో గిల్ నాయకత్వం గురించి మోస్ట్ పాపులర్ ప్లేయర్ సౌరవ్ గంగూలీ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. గిల్ హనీమూన్ పీరియడ్ ముగిసిందన్నాడు. సారథిగా గిల్ తన ప్రయాణాన్ని అద్భుతంగా మొదలు పెట్టాడు. అయితే ఇక మీదట ఇలాగే ఉండదు. అతడికి కెప్టెన్సీ బాధ్యతలు కొత్త. ఆ పరంగా ఇది శుబ్‌మన్‌కు హనీమూన్ పీరియడ్. కానీ రాబోయే సిరీస్‌ల్లో అతడు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోక తప్పదు. ఇంగ్లండ్‌తో నెక్స్ట్ జరిగే 3 టెస్టుల్లో గిల్‌పై కచ్చితంగా ప్రెజర్ పడుతుంది అని దాదా చెప్పుకొచ్చాడు. హనీమూన్ పీరియడ్ ముగిసిందనే విషయాన్ని అతడు గ్రహించాలని.. రాన్రానూ అతడిపై తీవ్ర ఒత్తిడి పడటం ఖాయమన్నాడు గంగూలీ. సవాళ్లకు సిద్ధంగా ఉండాలని.. లైట్ తీసుకుంటానంటే కుదరదన్నాడు. భారత్‌లో అపార ప్రతిభావంతులైన క్రికెటర్లు ఎంతో మంది ఉన్నారని గంగూలీ అన్నాడు. ప్రతి తరంలో అద్భుతమైన ఆటగాళ్లు వస్తున్నారని చెప్పాడు. సునీల్ గవాస్కర్, కపిల్‌దేవ్, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే లాంటి ప్లేయర్స్ తర్వాత విరాట్ కోహ్లీ లాంటి ప్లేయర్స్ వచ్చారు. ఇప్పుడు శుబ్‌మన్ గిల్, ఆకాశ్‌దీప్, యశస్వి జైస్వాల్, ముఖేష్ కుమార్, మహ్మద్ సిరాజ్ లాంటి వాళ్లు అదరగొడుతున్నారు అని మెచ్చుకున్నాడు.





# దర్శకుడితో సమంత వెకేషన్.. ఫోటోలు వైరల్

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ సమంత, బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరు గత కొంతకాలంగా డేటింగ్ లో ఉన్నారంటూ వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. సామ్ కూడా తన బిహేవియర్ తో ఈ వార్తలు నిజమేనంటూ హింట్స్ ఇచ్చేలా చేస్తున్నాయి. ఇక రీసెంట్ గా సమంత, రాజ్ తో కలిసి ఓ వెకేషన్ కి వెళ్లి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో సామ్ షేర్ చేశారు. దీంతో ఇవి కాస్త వైరల్ మారాయి. రాజ్ వైఫ్ శ్యామాలి లేటెస్ట్ గా తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీస్ లో ఇంట్రెస్టింగ్ మెసేజ్ ను షేర్ చేశారు. ఈ పోస్ట్ లో ఏముందంటే.. మతమేదైనా మన చర్యలతో ఇతరులను బాధించవద్దు అనే చెబుతుందని.. అదే మనం జీవితంలో పాటించాల్సిన గొప్ప నియమమని అందులోని సారాంశం. సామ్, రాజ్ ఫోటోలు వైరల్ గా మారిన టైమ్ లో శ్యామాలి పెట్టిన ఈ పోస్ట్ చర్చకు దారితీసింది. ఆ ఫోటోల కారణంగా ఆమె బాధపడి ఉండొచ్చని.. అందుకే ఆమె ఈవిధమైన సందేశాన్ని పంచుకుని ఉంటారని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే శ్యామాలి చాలా ఫ్రీక్వెన్ట్ గా ఇలాంటి మెసేజ్ ఓరియెంటెడ్ పోస్టలు షేర్ చేస్తుంటారు. రాజ్, సమంతలపై వార్తలు వస్తున్నప్పటినుంచి ఆమె పోస్టలపై నెటిజన్ లు ఇంట్రెస్ట్ చూపుతున్నారు. కొన్నిరోజుల క్రితం నమ్మకం, కర్మ సిద్ధాంతం గురించి పోస్టులు పెట్టారు. నమ్మకాన్ని ఒక్కసారి కోల్పోతే ఎంత ఖర్చు పెట్టినా తిరిగి పొందలేమని కొన్నిరోజుల క్రితం ఆమె రాసుకొచ్చారు. కాలం అన్నింటినీ బయటపెడుతుంది.. కర్మ సమాధానం చెబుతుంది అని కొన్నిరోజుల క్రితం ఒక పోస్ట్ ను షేర్ చేశారు. శ్యామాలి చివరిసారి 2023లో రాజ్ తో కలిసున్న ఫొటోను షేర్ చేశారు. వీరిద్దరూ విడిపోతున్నారంటూ కొన్ని రోజుల క్రితం వార్తలు కూడా వచ్చాయి. ఆయా స్టోరీస్ ను బేస్ చేసుకుని రాజ్, శ్యామాలి ఎక్కడా రెస్పాన్డ్ కాలేదు. రాజ్ అండ్ డీకే కలిసి తెరకెక్కించిన ది ఫ్యామిలీమ్యాన్ సీజన్ 2, సిటడెల్: హనీ బన్నీలో సమంత నటించారు. ఆయా ప్రాజెక్టల కోసం వర్క్ చేస్తున్న సమయంలోనే రాజ్ తో ఆమెకు పరిచయం ఏర్పడింది. రీసెంట్ గా సమంత నిర్మించిన శుభం సినిమాకి రాజ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ గా ఉన్నారు. వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ.. అధికారికంగా ఎక్కడా స్పందించలేదు. వెకేషన్ లో భాగంగా సమంత ఎక్కడికి వెళ్లినా.. రాజ్ కూడా వెంట ఉండటం ఆ స్టోరీస్ కు మరింత ఆజ్యం పోశాయి. ఈ క్రమంలోనే అమెరికా వెకేషన్ కు వెళ్లిన సామ్.. తన ఫ్రెండ్స్ తో కలిసి ఉన్న ఫొటోలను పంచుకున్నారు. ఇందులో ఆమెతో పాటు రాజ్ నిడిమోరు కూడా ఉన్నారు. అమెరికా వీధుల్లో వీరిద్దరూ కలిసి నడుస్తూ.. రెస్టారెంట్ లోనూ ఫుడ్ తింటూ కనిపించారు. ఈ ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. వీరిద్దరూ క్లోజ్ గా ఉండడం చూసి కొందరు అభిమానులు కంగ్రాట్స్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఏది ఏమైనా సామ్ వైరల్ ఫోటోలు మాత్రం తీవ్ర దుమారం రేపుతున్నాయి.



# వార్ 2 విషయంలో కియారా ఎగ్జైట్మెంట్

ప్రజంట్ బాలీవుడ్ సినిమా నుంచి రాబోతున్న అవైటెడ్ సినిమా ఏదన్నా ఉంది అంటే అది బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ అలాగే మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కాంబోలో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన భారీ సినిమా వార్ 2 అనే చెప్పవచ్చు. మరి ఈ సినిమాలో హృతిక్ రోషన్ సరసన హ్యాపెనింగ్ బ్యూటీ కియారా అద్వానీ నటించిన సంగతి తెలిసిందే. ఇక లేటెస్ట్ గానే సినిమా షూటింగ్ కంప్లీట్ కావడంతో హృతిక్ రోషన్ చేసిన పోస్ట్ ఒకటి వైరల్ గా కూడా మారింది. ఇక లేటెస్ట్ గా దీనికి హీరోయిన్ కియారా అద్వానీ కూడా యాడ్ అయ్యింది. తనకి కూడా అంతే ఎగ్జైట్మెంట్ ఉందని హృతిక్ రోషన్ తో పని చేయడం అనేది ఒక మర్చిపోలేని అనుభూతి, అయాన్ పనితనం వరల్డ్ ఎప్పుడు చూస్తుందా అని వెయిట్ చేస్తున్నాను, అయాన్ ఇంకా ఎన్టీఆర్ అలాగే తమ టీం అంతా వార్ 2 కి ప్రాణం పోశారు అంటూ ఆలియా తెలిపింది. దీనితో ఈ పోస్ట్ ఇపుడు వైరల్ గా మారింది. ఇక కియారా ప్రజంట్ భారీ లైనప్ లో వర్క్ చేస్తున్నారు. ముఖ్యంగా ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయితే ఇక బాలీవుడ్ లో కియారాకు ఎలాంటి తిరుగు ఉండదు.

## లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ లో

# కూలీ?

సినీ ఇండస్ట్రీలో ఎవరైనా ఇద్దరు యాక్టర్స్ ఒకే స్క్రీన్ పై కనిపించారంటే భారీ అంచనాలు క్రియేట్ అవుతాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. లేటెస్ట్ గా సూపర్ స్టార్ రజనీకాంత్, యాక్షన్ కింగ్ అర్జున్ కలిసి నటించేందుకు ఆస్కారం ఉందనే విషయం వినిపిస్తుంది. రజనీకాంత్ నటిస్తున్న కూలీ సినిమా లోకేష్ కనగరాజ్ యూనివర్స్ లో భాగం కాబోతోందనే ఊహాగానాలు ఇప్పుడు స్టార్ట్ అయ్యారు. దీనికి కారణం లేటెస్ట్ గా కొరియోగ్రాఫర్ శాండీ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్. లోకేష్ కనగరాజ్, అర్జున్ సర్జాల తో కలిసి శాండీ మాస్టర్ సోషల్ మీడియాలో షేర్ చేసిన కొత్త పోస్ట్ లో రజనీకాంత్ కూలీ ఎల్.సి.యులో భాగం అనే కొత్త ఊహా సిద్ధాంతానికి దారి తీసింది. తన పుట్టినరోజు సందర్భంగా శాండీ ఈ పోస్ట్ ని షేర్ చేయగా దీనిపై లోకేష్ కనగరాజ్ అభిమానులు మండిపడుతున్నారు. శాండీ తన పోస్ట్ లో కామెంట్ చేస్తూ.. అర్జున్ సర్జా, ఉమాపతి రామయ్య తన బర్త్ డే పార్టీకి హాజరైనందుకు థ్యాంక్స్ చెప్పారు. ఈ కాంబినేషన్ తో కూలీ సినిమా లోకేష్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం అనే టాపిక్ కు దారి తీసింది. నెటిజన్లు చాలా ఉత్సాహంగా ఈ డిబేట్ లో పార్టిసిపేట్ చేస్తున్నారు. అభిమానులు కూలీలో లియో హెరాల్డ్ దాస్? నటిస్తారు అని డౌట్ ను వ్యక్తం చేస్తున్నారు. దళపతి విజయ్ నటించిన లియోలో హెరాల్డ్ దాస్ గా నటించిన అర్జున్ సర్జా కూలీలోను నటిస్తే బావుంటుందని అభిమానులు సూచించారు. శాండీ బర్త్ డే పార్టీలో అర్జున్ కనిపించగానే ఈ ఊహాగానాలకు రెక్కలొచ్చాయి. జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాలు.. ఈ ప్రత్యేకమైన రోజు అర్జున్ సర్ ఆశీర్వాదాలు.. మీ ప్రేరణ ప్రతిరోజూ మెరుగ్గా కృషి చేయడానికి నాకు సహాయపడతాయి.. సినిమా పట్ల మీ అంకితభావం ఆశావహ కళాకారులకు నిజమైన ప్రేరణ.. అని రాసారు. అయితే లోకేష్ కనగరాజ్ ఈ వార్తలపై ఎగ్జయిట్ అవుతూ.. నాపై మీకున్న ప్రేమ మంచి విషయాలకు దారి తీస్తుందని అన్నారు. అయితే కూలీ అనేది ఒక ఇండిపెండెంట్ స్టోరీ అని లోకేష్ కనగరాజ్ ప్రతిసారీ చెబుతూనే ఉన్నారు. ఎల్.సి.యులో కూలీ భాగమా కాదా? అన్నది లోకేష్ స్వయంగా అనౌన్స్ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ అదే నిజంగా జరిగితే అది మరిన్ని సంచలనాలకు దారి తీయొచ్చు. కూలీ సినిమాని కళానిధి మారన్ సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ సినిమాలో రజనీకాంత్ తో పాటు నాగార్జున, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, సత్యరాజ్, శ్రుతి హాసన్, రెబా మోనికా జాన్ యాక్ట్ చేశారు. ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందించారు. ఈ సినిమా 2025 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ మూవీలో రజనీకాంత్ లుక్స్ అండ్ యాక్షన్ పార్ట్ అదిరిపోతుందని టాక్ వినిపిస్తుంది. ఈ సినిమాకి సంబంధించిన పోస్టర్లు కూడా తెగ వైరల్ అవుతున్నాయి.






## హరిహర వీరమల్లు

# రన్ టైం లాక్

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించిన అవైటెడ్ హిస్టారికల్ సినిమానే హరిహర వీరమల్లు. ఎన్నో ఏళ్ళ నిరీక్షణ తర్వాత ఎట్టకేలకి ఈ జూలైలో సినిమా విడుదల కాబోతుంది. మరి ఈ గ్యాప్ లో ప్రమోషన్స్ ఇతర పాటలు కూడా రావాల్సి ఉండగా సినిమా రన్ టైం పై కూడా పలు వార్తలు బయటకి వచ్చాయి. అయితే మొదట హరిహర వీరమల్లుని మేకర్స్ 2 గంటల 40 నిమిషాలకి కట్ చేసినట్టుగా వినిపించింది. కానీ లేటెస్ట్ సమాచారం ఏంటంటే మొత్తంగా 2 గంటల 42 నిమిషాల నిడివి గల సినిమా థియేటర్స్ లో పడనుందట. ఇక సెన్సార్ కి కూడా సినిమా పంపాల్సి ఉండగా అక్కడ మరింత క్లారిటీ సినిమాపై రానుంది. ఇక ఈ భారీ సినిమాకి ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాణం వహించిన ఈ సినిమా ఈ జూలై 24న పాన్ ఇండియా భాషల్లో విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ లుక్స్ అండ్ యాక్షన్ సీక్వెన్సులు భారీగా ప్లాన్ చేశారు. క్యారెక్టర్ ఎలివేషన్ విషయంలో కూడా డైరెక్టర్ చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ ను ఎలా అయితే చూడాలనుకుంటున్నారో అలానే చూపిస్తారట. అంతేకాకుండా ఫస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కావడంతో మరింత అంచనాలు క్రియేట్ అయ్యాయి. మరి ఈ సినిమా పవన్ కళ్యాణ్ సినీ కెరీర్ లో ఎలాంటి సక్సెస్ ను తెచ్చిపెడుతుందో చూడాలి. దీంతో పాటు నెక్స్ట్ పవన్ కళ్యాణ్ లైనప్ కూడా భారీగానే ఉంది.



# అల్లు, అట్లీ కాంబోలో హాలీవుడ్ స్టార్ విలన్?

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా పుష్ప సీరీస్ హిట్ తర్వాత నెక్స్ట్ టార్గెట్ ను హాలీవుడ్ రేంజ్ లో ప్లాన్ చేశారు. ఈ క్రమంలో కోలీవుడ్ కమ్ బాలీవుడ్ డైరెక్టర్ అట్లీతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. అయితే అల్లు, అట్లీ కాంబో నెవ్వర్ బిఫోర్ అనేలా ఉంటుందని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఇద్దరు కూడా అంతకుమించి అనేలా ఆలోచిస్తున్నారట. ఏకంగా హాలీవుడ్ ను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కాంబో ఫిక్స్ అయినప్పటి నుంచే సినిమా రేంజ్ భారీగా పెరిగింది. ఫుల్ మాస్, స్టైలిష్ ట్రీట్ కావొచ్చని ఫ్యాన్స్ లో అంచనాలు పెరిగిపోయాయి. ఇప్పుడు ఆ కాంబో మీద ఇంకొక భారీ వార్త వైరల్ అవుతోంది. లేటెస్ట్ సమాచారం ప్రకారం, ఈ సినిమాకు విలన్ గా హాలీవుడ్ స్టార్ విల్ స్మిత్ తో డిస్కస్ చేశారట. ఐ యామ్ లెజెండ్, మెన్ ఇన్ బ్లాక్, కింగ్ రిచర్డ్ వంటి వరల్డ్ ఫేమస్ సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న విల్ స్మిత్.. ఈ భారీ బడ్జెట్ తెలుగు సినిమాలో అల్లు అర్జున్ కు శత్రువుగా కనిపించనున్నారట. ఈ ప్రాజెక్ట్ కు స్కై ఫై నేపథ్యం ఉండనుందని టాక్. 800 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కనున్న ఈ సినిమా ఇండియన్ సినిమా స్టాండర్డ్ ను మరో లెవెల్ కు తీసుకెళ్లేలా ఉండనుందని అంటున్నారు. విల్ స్మిత్ కన్ఫామ్ కాకపోతే.. డ్వేన్ జాన్సన్ అనే మరో స్టార్ పేరును కూడా అట్లీ టీమ్ చెక్ చేస్తుందని తెలుస్తుంది. మరి ఇద్దరిలో ఎవరు ఫిక్స్ అవుతారో చూడాలి. ఇక హీరోయిన్ విషయంలో అయితే ఈ సినిమా మరింత హై లెవెల్ గా మారనుంది. ఇప్పటికే దీపికా పదుకోన్ హీరోయిన్ గా ఫిక్స్ అయ్యారు. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా ఈ సినిమాలో కీ రోల్స్ ప్లే చేస్తున్నారు. అంటే స్క్రీన్ మీద గ్లామర్ తో పాటు పెర్ఫార్మెన్స్ కు స్కోప్ ఉన్న పాత్రలు ఉంటాయన్నమాట. ఈ మాస్ కాంబినేషన్ కు సన్ పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. టెక్నికల్ టీమ్, విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ బ్లాక్ లెవెల్ అంతా ఇంటర్నేషనల్ స్టాండర్డ్ లో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. త్వరలో ఈ సినిమాకు సంబంధించి అఫిషియల్ అనౌన్స్ మెంట్ రావొచ్చని ఫిలిం నగర్ టాక్. ఇక విల్ స్మిత్ తెలుగు తెరపై కనిపిస్తే అది ఇండియన్ సినిమాకు కూడా ఒక బిగ్ అచీవ్ మేంట్ గా నిలవనుంది. మరి ఇది ఎంతవరకు నిజమవుతుందో చూడాలి.